





సంక్రాంతికి వస్తున్నాం

పల్లెకు పండగొచ్చింది



రాజమహేంద్రవరం బస్ కాంప్లెక్స్‌లో బ్యాగ్‌లతో ప్రయాణికులు..

గోదావరి జిల్లాల ఆప్యాయత.. అనురాగాలు.. ప్రేమకు తిరుగులేదు.. కాలం మారినా అదే తీరు.. గోదావరి నీటిలోనే ఆ ప్రేమ ఇమిడి ఉందో ఏమిటో తెలియదు కానీ.. గత పది రోజులుగా ప్రతి ఇంట్లోనూ పండుగకు ఎప్పుడొస్తున్నారు.. ఎప్పుడొస్తున్నారు.. అనే మాటకు అలుపే లేదు.. అంత ఆప్యాయతగా పిలిస్తే ఎందుకురారు.. సంక్రాంతికి వస్తున్నాం.. అంటూ బంధువులు వచ్చేస్తున్నారు.. అటు హైదరాబాద్ ఇటు వైజాగ్ నుంచి దారులన్నీ గోదావరి జిల్లాల వైపే చూపిస్తున్నాయి.. రైళ్లు ఫుల్ అయిపోతున్నాయి.. బస్‌ల సంగతి సరే సరి.. విమానాలదీ అదే పరిస్థితి.. కార్లు.. ద్విచక్ర వాహనాలపై వచ్చే వారి సంఖ్య తక్కువేం లేదు.. రోడ్లన్నీ కిక్కిరిసిపోతున్నాయి.. గోదావరి జిల్లాల్లోని పల్లెబాట పడుతున్నాయి..

- దారులన్నీ ఇటువైపే
- ప్రధాన నగరాల నుంచి రాక
- తరలివస్తున్న బంధుగణం
- బస్‌లు..రైళ్లు..విమానాలు ఫుల్
- కళకళలాడుతున్న పల్లెలు
- సొంత వాహనాలే ఆధారం
- హైవేలపై ట్రాఫిక్‌జామ్‌లు
- గోదావరి జిల్లాల్లో సందడి

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

సంక్రాంతి వచ్చిందంటే గోదావరి జిల్లాల్లో సందడే వేరు.. ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా కుటుంబాలతో పండుగకు వస్తారు.. పట్టణం నుంచి పల్లెబాట పడతారు.ఉమ్మడి జిల్లాల నుంచి లక్షలాదిమంది బెంగళూరు, పుణే, చెన్నై, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో స్థిరపడ్డారు. వీరిలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లే ఎక్కువ. శుక్రవారం పని ముగించుకుని శని, ఆదివారం సెలవు కావడంతో పండుగకు బయలుదేరిపోయారు. శనివారం అర్ధరాత్రి నుంచే గోదావరి జిల్లాల రోడ్లకు తాకిడి పెరిగింది. రైల్వేస్టేషన్లు, ఆర్టీసీ బస్టాండ్లు, మధురపూడి ఎయిర్‌పోర్ట్ కిటకిటలాడిపోతున్నాయి. ప్రయాణికుల సంఖ్య గతంకంటే పెరిగింది. రాజమహేంద్రవరం విమానాశ్రయం నుంచి కొద్దినెలల కిందట కేవలం 1300 మంది వరకూ రాకపోకలు సాగిస్తే.. ప్రస్తుతం రోజూ 2 వేలమంది రాకపోకలు సాగిస్తున్నారు. కొద్ది రోజుల కిందట 80 శాతం నుంచి 95 శాతం వరకూ ఆక్యుపెన్సీ ఉండగా ప్రస్తుతం ఫుల్ అయిపోతున్నాయి. ముంబై, ఢిల్లీ నుంచి వచ్చే వారి సంఖ్య పెరిగింది. ఇక ఆర్టీసీలో సాధారణ రోజుల్లో 25 వేలమంది వరకూ ప్రయాణిస్తుంటే ప్రస్తుతం 50 వేలమంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. స్వగ్రామాలకు చేరుతున్న విద్యార్థులు, ప్రజలతో బస్టాండ్లు కిక్కిరిసిపోయాయి. కాకినాడ నగరంతోపాటు రాజమహేంద్రవరం, అమలాపురం, రాజోలు, జగ్గంపేట, ఏలేశ్వరం, రావులపాలెం బస్టాండ్లలో సందడి కనిపించింది. రైళ్లలో ప్రతి రోజూ వేలాదిమంది రాకపోకలు సాగిస్తుంటే.. ఆయా రైల్వే స్టేషన్లన్నీ ఊపిరాడనంతగా కిక్కిరిసిపోతున్నాయి. ప్రధానంగా రాజమహేంద్రవరం, సామర్లకోట రైల్వే స్టేషన్లకు సంక్రాంతి పండుగ ప్రయాణికుల తాకిడి విపరీతంగా ఉందని చెబుతున్నారు.



కాకినాడ రైల్వేస్టేషన్‌లో రద్దీ

200 బస్‌లు ఫుల్..

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగకు ఆర్టీసీ బస్సులన్నీ ఫుల్ అయిపోయాయి. పండుగ ముందు, తర్వాత కూడా వందశాతం బుకింగ్ పూర్తయింది. శనివారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకు బస్సులేవీ ఖాళీ లేకపోవడంతో హైదరాబాద్ నుంచి వచ్చే ప్రయాణీకుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. సంక్రాంతి ప్రయాణాలకు ఆర్టీసీ బస్సుల్లో సీటు దొరికే పరిస్థితి లేకుండాపోయింది. హైదరాబాద్ నుంచి తెలుగు రాష్ట్రాలకు సంక్రాంతి పండుగ సందర్భంగా వచ్చే ప్రయాణీకులను దృష్టిలో పెట్టుకుని హైదరాబాద్ నుంచి ఉమ్మడి జిల్లాకు సుమారు 200 బస్సులు నడిపేందుకు ఆర్టీసీ అధికారులు ఏర్పాట్లు చేశారు. అయితే బస్సులన్నీ ఫుల్ అయిపోయాయి. డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని మరిన్ని స్పెషల్స్ నడిపేందుకు ప్లాన్ చేస్తున్నారు. దీనిని బట్టి చూస్తే తిరుగు ప్రయాణం కూడా కష్టంగా ఉండబోతుంది. ఈనెల 16 నుంచి 19 వరకు సీటు దొరికే పరిస్థితి లేదు. తిరుగు ప్రయాణాలు చేసుకునే వారికి 20వ తేదీ నుంచి మాత్రమే సీట్లు అందుబాటులో ఉన్నాయి.

జాతీయ రహదారులు కిటకిట

కార్పొరేషన్(కాకినాడ)/నల్లజర్ల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని జాతీయ రహదారులపై సంక్రాంతి సందడి మొదలైంది. వరుస సెలవులు కావడంతో పట్టణాల నుంచి పల్లెలకు ప్రజలు పయనమయ్యారు. హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాలకు బయలుదేరిన వారితో శుక్ర, శనివారాలు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని రహదారులపై వాహనాల రద్దీ నెలకొంది. విశాఖపట్నం నుంచి విజయవాడ 16వ నెంబర్ జాతీయరహదారి, కత్తిపూడి నుంచి పామర్రు 216వ నెంబరు హైవేపై వాహనాల రద్దీ కనిపిస్తోంది. ఈ రద్దీ తిరుగు ప్రయాణికులతో ఈనెల 19వ తేదీ వరకు కొనసాగనుంది.

రద్దీ ఎక్కువగా ఉంటే.. స్కూల్ బస్‌లు తిప్పేయండి..



కార్పొరేషన్(కాకినాడ), జనవరి 11: పండుగ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రయాణికులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా తగిన చర్యలు చేపట్టాలని డీజీపీ, ఏపీఎస్ ఆర్టీసీ ఎండీ ద్వారకాతిరుమలరావు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఎస్పీలు, ఆర్టీసీ డీపీటీవో, డీటీసీలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. సంక్రాంతి పండుగకు సొంతూళ్లకు వెళుతున్న ప్రయాణికులకు సరిపడా బస్సు సౌకర్యాల్లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని, అటువంటిచోట్ల తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆర్టీసీ బస్సులు సరిపోకపోతే ప్రైవేట్ కాలేజీ, స్కూల్ బస్సులను ఉపయోగించాలని సూచించారు.

- డీజీపీ, ఏపీఎస్ ఆర్టీసీ ఎండీ ద్వారకాతిరుమలరావు

'బరి' తెగింపు!

- సంక్రాంతి కోడిపందాలకు జిల్లాలో భారీగా సిద్ధమవుతున్న బరులు
- బరులతోపాటే గుండాటల నిర్వహణకు గ్రామాలవారీగా వేలం పాటలు
- బరుల వారీ వసూలు చేసే డబ్బుల్లో నేతలు, పోలీసు, రెవెన్యూకు వాటాలు
- జగ్గంపేట పామాయిల్ తోటలో బరి, గుండాటకు రూ.36 లక్షల వేలంపాట
- కరపలో ఒక బరిలో 64 పందాలు.. ఎక్కువ గెలిచినవారికి థార్ జీపు గిఫ్ట్

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో సంక్రాంతికి కోడి పందాల బరులు సిద్ధమయ్యాయి. పండగ మూడు రోజుల్లో అన్ని మండలాల్లో గ్రామాల వారీగా పందాల నిర్వాహకులు అప్పుడే పెద్దఎత్తున బరులు సిద్ధంచేస్తున్నారు. ఇందుకోసం బరుల వారీగా వేలంపాటలు నిర్వహిస్తున్నారు. అలాగే గుండాటకు అనుమతుల పేరుతో రేట్లు కడుతున్నారు. పందాలు, గుండాటకు కలిపి పెద్దగ్రామాల్లో అప్పుడే వేలంపాటలు పూర్తవగా, చిన్న గ్రామాల్లో కొనసాగుతున్నాయి. ప్రస్తుతం పందాలు, గుండాటకు కలిపి పెద్దగ్రామాల్లో రూ.25 లక్షల నుంచి అత్యధికంగా రూ.36 లక్షల వరకు వేలంపాటలు జరిగాయి. చిన్న గ్రామాల్లో బరులు, గుండాటకు విడివిడిగా వేలం జరుగుతోంది. ప్రధానంగా జగ్గంపేట మండలంలో ఆరుచోట్ల భారీ బరులను సిద్ధం చేస్తున్నారు. రామవరంలో పామాయిల్ తోటలో జిల్లా స్థాయిలో పందాలు నిర్వహించడానికి ఇక్కడ బరికి రూ.36 లక్షలకు వేలం పూర్తయింది. పందెంరాయుళ్లు, గుండాట నిర్వాహకులు ఈ డబ్బును స్థానిక నేతలకు అప్పగించనున్నారు. ఈ డబ్బుల్లో కొంత బరుల నిర్వహణకు, స్థానిక ఆలయ ఉత్సవాలకు కొంత తీసి మిగిలింది నేతలు, పోలీసు, రెవెన్యూ అధికారులు పంచుకునేలా ఒప్పందాలు కుదిరాయి. అలాగే జగ్గంపేట టవర్ కాలనీలో రూ.6.50 లక్షలు, గోవిందపురం రూ.10 లక్షలు, కాట్రావులపల్లి రూ.5 లక్షలకు బరులు, గుండాటలకు కలిపి వేలం ఖాయమైంది. అయితే ఎన్ని బరులు నిర్వహించుకుంటే అన్ని బరుల నుంచి మామూళ్లు నేతలు, పోలీసులు, రెవెన్యూ అధికారులకు వెళ్లనున్నాయి. సరాసరి ఓ మండలంలో ఉండే స్టేషన్‌కు అన్ని బరుల నుంచి కలిపి మూడురోజులకు రూ.8 లక్షల వరకు అందనుంది. అటు ప్రత్తిపాడు, ఏలేశ్వరం, రౌతులపూడి, తుని, కోటనందూరు, గండేపల్లి, కిర్లంపూడి మండలాల్లో గ్రామాలవారీగా వేలం పాటలను నిర్వహిస్తున్నారు. కొన్నిచోట్ల బరులు, గుండాటలకు విడివిడిగాను, కలిపి పాటలు పెడుతున్నారు. ఎవరు ఎక్కువ ధరకు పాడుకుంటే వారికి అనుమతులు ఇస్తున్నారు. రౌతులపూడి, ప్రత్తిపాడు, కోటనందూరు తదితర మండ లాల్లో బరులకు లక్ష చొప్పున ధర కట్టారు. గుండాట బోర్డులకు ఒక్కో దానికి పెద్ద గ్రామంలో రోజుకు రూ.25 వేలు, చిన్నగ్రామాల్లో రూ.10 వేల చొప్పున వసూళ్లు చేస్తున్నారు. అలాగే తుని నుంచి గండేపల్లి వరకు ఉన్న జాతీయ రహదారి వెంబడి తోటల్లో బరులు, గుండాటలకు కలిపి నిర్వాహకుల నుంచి రూ.5 లక్షల వరకు వసూలు చేస్తున్నారు. ఈ ప్రాంతాల్లో వ్యాపారం గట్టిగా ఉంటుందనే కారణంతో బెల్ట్‌షాపులు ఏర్పాటు చేసేవారి నుంచి కూడా డబ్బులు వసూలు చేస్తున్నారు. కాకినాడ రూరల్ నియోజకవర్గంలో పందాలకు బడాబాబులు వచ్చే అవకాశం ఉన్నందున షామియానాలు, లైవ్ ప్రసారాలు, అక్కడికక్కడే పందాలకు వీలుగా మైకొసెట్లు వంటివి ఏర్పాటు చేస్తున్నారు. ప్రధానంగా సర్పవరం, వాకలపూడి, కరప మండలాల్లో ఒక్కో బరికి గుండాట అనుమతులతో కలిపి వేలం లక్షల్లో నాలుగు రోజుల కిందే పూర్తయింది. సర్పవరంలో ఓ బరికి ఏకంగా రూ.40 లక్షల వేలం కుదిరింది. గుండాట బోర్డులు భారీగా ఏర్పాటు చేసుకునేందుకు నిర్వాహకుల నుంచి మూడు రోజులకు ఈ మొత్తం ఖాయం చేశారు. ఇందులో కమీషన్, ఖర్చులు 20 శాతం పోను మిగిలింది పంపకాలకు కేటాయించారు. ఇలా కరప బరికి రూ.33 లక్షలు, గొర్రిపూడిలో రెండు బరులు, గుండాటకు చెరో రూ.10లక్షలు, గురజనాపల్లి రూ.25లక్షలు, వేళంగి రూ.10, కొంగోడు రూ.25లక్షలు, విజయరాయుడుపాలెం రూ.8 లక్షలు, యండమూరు రూ.7లక్షల చొప్పున వేలం ఖాయమైంది. ఈ బరుల నుంచి రూరల్, కరప పోలీసుస్టేషన్లకు జిల్లాలోనే అత్యధికంగా రోజుకు రూ.10లక్షలకుపైగా మామూళ్లు ఇవ్వడానికి సిద్ధం చేశారు. ఇదికాకుండా రోజుకు పదిహేను కోసలు ఇవ్వడానికి అంగీకారం కుదిరింది. మరోపక్క కరపలో ఓ బరిలో మూడు రోజులకు కలిపి 63 జతల జోడు పందాలు నిర్వహించనున్నారు. ఇందులో అత్యధిక పందాలు గెలిచిన విజేతకు మహీంద్రాథార్ జీపు బహుమతిగా ఇవ్వడానికి వాహనం కొనుగోలు చేశారు. సామర్లకోట రూరల్‌లో ఏకంగా ఎనిమిదిచోట్ల బరులకు ఒక్కో దానికి రూ.10లక్షల నుంచి రూ.18లక్షల వరకు వేలం వెళ్లింది. పెద్దాపురం ఆరు చోట్ల బరులకు వేలం పూర్తయింది. ఇందులో గుండాట బోర్డుల అనుమతికి ఒక్కోదానికి రూ.5 లక్షల వరకు వేలం ఖాయం చేశారు. అటు తాళ్లరేవులోనూ భారీ బరులు సిద్ధం చేశారు.



అచ్చంపేట ఏడీబీ రోడ్డులో సిద్ధమైన బరి

పండుగకు రావాలనే.. కంగారొద్దు!

పండుగకు స్వగ్రామాలకు రావాలనే కంగారొద్దు..

జాగ్రత్తగా రండి.. లేదంటే ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంటుంది.. వచ్చీరాని డ్రైవింగ్‌తో ఇంత రద్దీ సమయంలో దూర ప్రయాణం కష్టమే.. అందుకే ఆలోచించి నిర్ణయం తీసుకోండి.. లేదంటే ప్రమాదాలు జరగొచ్చు..పండుగ నేపథ్యంలో చాలా మంది బెంగళూరు, హైదరాబాద్, పుణె.. తదితర ప్రాంతాల నుంచి తరలివస్తున్నారు. ఇలా వచ్చే వారి కారులో తప్పనిసరిగా ఇద్దరు డ్రైవింగ్ వచ్చిన వారు ఉండాల్సిందే.. ఎందుకంటే ఒకరు నిద్రపోయినా మరొకరు డ్రైవింగ్ చేయొచ్చు. లేదా నిద్ర వస్తే రహదారి పక్కన కాసేపు నిలిపివేసి నిద్రపోండి. ఎంత ఆనందంగా వస్తున్నారో అంతే భద్రంగా తిరిగెళ్లాలి సుమా..!

ఒక్క క్షణంలో.. ఘోరం!

- అన్నవరం దైవదర్శనానికి వెళ్తూ ఆగిఉన్న లారీని ఢీకొన్న కారు.. ముగ్గురి మృతి.. నలుగురికి తీవ్ర గాయాలు
- కాకినాడ జిల్లా కత్తిపూడి జాతీయ రహదారిపై ఘటన

7



ప్రమాద దృశ్యం



ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

వడ్డే ఓబన్నకు కలెక్టర్ నివాళి

కలెక్టరేట్(కాకినాడ), జనవరి 11(ఆంధ్రజ్యోతి): బ్రిటీష్‌పాలనకు వ్యతిరేకంగా చేసిన పోరాటంలో వడ్డే ఓబన్న కీలకపాత్ర పోషించారని కలెక్టర్ షాన్ మోహన్ పేర్కొన్నారు. ప్రముఖ స్వాతంత్ర సమర యోధుడు వడ్డే ఓబన్న జయంతి సందర్భంగా జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర పోరాటం ప్రారంభానికి ముందు 1857లో భారత దేశంలోని బ్రిటీష్ పాలన వ్యతిరేకంగా జరిగిన ప్రతి ఘటనలో వడ్డే ఓబన్న ముఖ్యపాత్ర పోషించారన్నారు. 1807 సంవత్సరం జనవరి 11న నంద్యాల జిల్లా సంజమల మండలంలో నొస్సం గ్రామంలో జన్మించిన వడ్డే ఓబన్న బ్రిటీష్ పాలకుల నుంచి పేద రైతులు, గ్రామస్థులు హక్కులను కాపాడంలో అసమానమైన పోరాటం చేశారన్నారు. బ్రిటీష్ వారిపై వ్యతిరేకంగా ఆయనచేసిన పోరాటంలో వడ్డే, బోయ, యానాది, చెంచు వంటి ఇతర సామాజిక వర్గాలకు చెందిన వ్యక్తులను భాగస్వామ్యం చేసుకుని ఉద్యమంలో కీలకపాత్ర పోషించారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ అధికారి లల్లి, కాకినాడ డివిజన్ సహాయ బీసీ సంక్షేమ అధికారి తేజోమూర్తుల వీరభద్ర ప్రసాద్, కార్యాలయ పర్యవేక్షకులు గోవాల సతీష్‌కుమార్, సూర్యశివప్రసాద్, ఈశ్వరి పాల్గొన్నారు.

అసలేం జరుగుతోంది?

- పవన్ వ్యాఖ్యలతో ఉలిక్కిపడ్డ పోలీసు యంత్రాంగం
- ఈవ్‌టీజింగ్‌పై ఉక్కుపాదం మోపేందుకు సిద్ధం
- ఫిర్యాదులపై ఉన్నతాధికారుల ఆరా

(ఆంధ్రజ్యోతి-పిఠాపురం)

పిఠాపురంలో ఏం జరుగుతోంది... పోలీసింగ్ అంత దారుణంగా ఉందా.. ఇదే పోలీసు యంత్రాంగంలో సర్వత్రా జరుగుతున్న చర్చ. బహిరంగ సభ వేదికగా సాక్షాత్తు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఇంత పరుషంగా వాఖ్యలు చేయడంతో ఉన్నతాధికారులు అసలు ఇక్కడ పరిస్థితి ఏమిటనే అంశంపై ఆరా తీస్తున్నారు. కొంతకాలంగా చోరీలు పెరగడం, గంజాయి వినియోగం అధికం కావడం, ఎక్కడబడితే అక్కడ విక్రయాలు సాగుతున్నా పోలీసులు దృష్టి పెట్టకపోవడం, ఈవ్‌టీజింగ్‌పై ఫిర్యాదులు వస్తున్నా సరిగా స్పందించకపోవడం, పోలీస్‌స్టేషన్ల వేదికగా కొందరు ప్రైవేటు వ్యవహారాల్లో సెటిల్‌మెంట్లు చేయడం వంటి వాటిపై తనకు నేరుగా ఫిర్యాదులు అందడంతోపాటు డిప్యూటీ సీఎం పేషీ అధికారులు పర్యటించిన సమయంలో పలువురు పలువురు ఈ విషయాలను వారి దృష్టికి తేవడంతోనే పవన్ ఇంత ఘాటుగా స్పందించారని చెబుతున్నారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తాను ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో, ముఖ్యంగా పిఠాపురం పట్టణంలో పోలీసుల పనితీరుపై బహిరంగంగానే తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేయడంతో పోలీసు ఉన్నతాధికారులు ఉలిక్కిపడ్డారు. కొంతకాలంగా పిఠాపురం పట్టణ పరిధిలో పోలీసింగ్ అంతగా లేదనే విమర్శ ఉంది. పోలీసు అధికారులు, సిబ్బంది స్టేషన్లకే పరిమితం కావడం, రహదారులపై అప్పుడప్పుడు కనిపించి హడావుడి చేయడం తప్ప అసాంఘిక శక్తులను నియంత్రించలేకపోతున్నారనే వాదన ఉంది. ఈవ్‌టీజింగ్‌పై ఫిర్యాదులు అందినా సకాలంలో స్పందించకపోవడం, చోరీల ఫిర్యాదులపై కేసు నమోదు చేయకుండా వాటి గురించి పట్టించుకోకపోవడం, పట్టణంలోని పలు ప్రాంతాల్లో గంజాయి వినియోగం బహిరంగంగానే జరుగుతుండడం, ఇతర ప్రాంతాలు వారు వచ్చి ఇక్కడ విక్రయాలు సాగిస్తున్నా వారిపై దృష్టి పెట్టకపోవడం తదితర అంశాలు పవన్ అసంతృప్తికి కారణాలుగా చెబుతున్నారు. గత రెండు మూడు నెలలుగా డిప్యూటీ సీఎం పేషీ అధికారులు పిఠాపురంలో పర్యటించిన సమయంలో పోలీసు శాఖ పనితీరుపై అత్యధికంగా ఫిర్యాదులు అందాయి. స్టేషన్ల వేదికగా లాయర్లు, కొందరు వ్యక్తులు సాగిస్తున్న సెటిల్‌మెంట్లు, ఫిర్యాదులపై సకాలంలో స్పందించకపోవడం, బైక్‌లపై విన్యాసాలు చేయడంతోపాటు రోడ్డు మధ్యలో బర్త్‌డే పార్టీలు, ఇతర కార్యక్రమాలు చేస్తున్నా పట్టించుకోకపోవడం తదితర అంశాలను కొందరు సాక్ష్యాలతో అందించినట్లు సమాచారం. అలాగే పట్టణంలో పలు ప్రాంతాల్లో చోరీలు అధికంగా జరుగుతున్నాయి. మార్కెట్ సెంటర్‌లో, పల్లపువీధి రామకోవెల వద్ద, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖ, ఉప్పాడ బస్టాండు తదితర ప్రాంతాల్లో ఇటీవల పలు చోరీలు జరిగాయి. వీటిపై ఫిర్యాదులు అందినా వాటిపై కేసులు నమోదు చేయలేదు. పవన్ వాఖ్యలు మరువక ముందే పట్టణ పోలీసుస్టేషన్‌కు కూతవేటు దూరంలోనే శుక్రవారం రాత్రి ఆటో చోరీకి గురయింది. ఇక్కడే వారం రోజుల కిందట మోటార్‌సైకిల్‌ను అపహరించారు. పట్టణంలో పదుల సంఖ్యలో బైక్‌ల చోరీలు జరుగుతున్నా పోలీసులకు పట్టడం లేదు. ఇక పట్టణంలో యువకుల బైక్‌లపై విన్యాసాలు అధికమయ్యాయి. వీరిలో కొందరు బస్సులు, ఆటోలు, ఇతర వాహనాలు ఆగే ప్రాంతాల్లో ఆడపిల్లలను ఏడిపిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు వద్ద ఈవ్‌టీజింగ్ జరుగుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదనే వాదన ఉంది. కళాశాల వద్ద ఈవ్‌టీజింగ్‌పై ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ ఫిర్యాదు చేసి పోలీసులను ఉంచాలని కోరినా ఇప్పటివరకూ స్పందించకపోవడాన్ని పవన్ ప్రస్తావించడం పోలీసుల అలసత్వాన్ని తేటతెల్లం చేస్తోంది. అయితే పోలీసింగ్ కనిపించకపోవడానికి కారణం సిబ్బంది కొరతగా చెబుతున్నారు. ఇంతకంటే తక్కువ సిబ్బందితో గతంలో సమర్థంగా విధులు నిర్వహించినా ఇప్పుడు అదే ప్రధాన కారణంగా చూపడం గమనార్హం. గతంలో పిఠాపురం పట్టణ పోలీసుస్టేషన్‌కు ఎస్‌ఐతోపాటు అదనపు ఎస్‌ఐ, ట్రాఫిక్‌కు ప్రత్యేకంగా ఎస్‌ఐ ఉండేవారు. ఇప్పుడు ఎస్‌ఐ ఒక్కరే ఉన్నారు. వీఆర్‌లో పలువురు ఎస్‌ఐలు ఉన్నా ఇక్కడికి మాత్రం ఎస్‌ఐలను నియమించకపోవడం గమనార్హం. గతంలో క్రైమ్‌కు ప్రత్యేకంగా ఎస్‌ఐను నియమించడంతోపాటు ఎస్‌హెచ్‌వోగా సీఐ ఉండేలా పోలీసుస్టేషన్ అప్‌గ్రేడ్ చేయాలనే ప్రతిపాదన ఉంది.

అవనిపై హరివిల్లు

విజయవాడలో సందడిగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీల ఫైనల్స్





ప్రథమ బహుమతి గెలుచుకున్న తమిళనాడు మహిళ

కడప, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు ద్వితీయ బహుమతులు

11 మందికి కన్సొలేషన్ బహుమతులు

బహుమతులు ప్రదానం చేసిన హోంమంత్రి అనిత

ఫైనల్స్‌లో ముగ్గులు వేస్తున్న పోటీదారులు (ఇన్‌సెట్‌లో) పోటీదారులతో కలిసి జ్యోతి వెలిగిస్తున్న కృష్ణాజిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ

ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్‌వారి పర్‌ఫెక్ట్, ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) ఫైనల్స్ శనివారం ఘనంగా జరిగాయి. విజయవాడలోని నారా చంద్రబాబు నాయుడు కాలనీలోని బ్యాడ్మింటన్ కోర్టులో నిర్వహించిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాలతో పాటు తమిళనాడు, కర్ణాటక విజేతలు కలిపి మొత్తం 15 మంది పాల్గొన్నారు. ప్రథమ బహుమతిని కె.భార్గవి (తమిళనాడు) సొంతం చేసుకోగా, మూడు ద్వితీయ బహుమతులను రమ్య (కడప), సావిత్రి (తూర్పు గోదావరి), వేణుభార్గవి (పశ్చిమ గోదావరి) సొంతం చేసుకున్నారు. మిగిలిన 11 మంది కన్సొలేషన్ బహుమతులు అందుకున్నారు. బహుమతుల ప్రదానోత్సవానికి హోంమంత్రి వంగలపూడి అనిత ముఖ్య అతిథిగా విచ్చేయగా, ఉమ్మడి కృష్ణా జిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ జ్యోతి వెలిగించి ఫైనల్స్ పోటీలను ప్రారంభించారు. ఏపీ సెంట్రల్ డెస్క్ ఇన్‌చార్జి టి.సురేష్, న్యూస్ ఎడిటర్ కె.నాగసుధాకర్, విజయవాడ యూనిట్ మేనేజర్ వి.మురళీ తదితరులు పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా అబ్బూరి రత్నలక్ష్మి, సూరపనేని ఉషారాణి వ్యవహరించారు.

- ఆంధ్రజ్యోతి, విజయవాడ







ద్వితీయ బహుమతులు అందుకుంటున్న రమ్య (కడప), సావిత్రి (తూర్పు గోదావరి), వేణుభార్గవి (పశ్చిమ గోదావరి).. (కుడి నుంచి ఎడమకు), ముగ్గులు పరిశీలిస్తున్న మంత్రి అనిత





కన్సొలేషన్ బహుమతులు అందుకుంటున్న పి.జ్యోతి (శ్రీకాకుళం), ఎం.రాజు (విజయనగరం), నాగమల్లేశ్వరి (కృష్ణా), డి.ఉష (నెల్లూరు), కవిత (ప్రకాశం), ఏ.సునీత (గుంటూరు), జి.శ్రీలక్ష్మి (కర్నూలు), ఎస్.రమ్యకృష్ణ (అనంతపురం), రెడ్డిరాణి (చిత్తూరు), ఏ.సంతోషి (విశాఖపట్నం), రోహిణి (కర్ణాటక). చిత్రంలో ఏపీ సెంట్రల్ డెస్క్ ఇన్‌చార్జి టి.సురేష్, న్యూస్ ఎడిటర్ కె.నాగసుధాకర్, విజయవాడ యూనిట్ మేనేజర్ వేమూరి మురళీ, న్యాయనిర్ణేత అబ్బూరి రత్నలక్ష్మి

కేరళ అందాలు సొంతం చేసుకున్న కోనసీమ



ఈత పోటీ విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న మంత్రి దుర్గేష్



ఈత పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్

ఆత్రేయపురంలో సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీ సంక్రాంతి సంబరాలు

ఉత్కంఠ భరితంగా ఈత పోటీలు

ఆత్రేయపురం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): కేరళ అందాలను సొంతం చేసుకున్న కోనసీమ ప్రాంతాన్ని పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్టు పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. శనివారం ఆత్రేయపురం కాలువ రేవు వద్ద ప్రధాన కాలువలో 3రోజుల పాటు జరిగే సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీ సంక్రాంతి సంబరాలు శనివా రం ప్రారంభించారు. తొలుతగా ఎంపీ గంటి హరీష్‌మాధుర్ జెండా ఊపి స్విమ్మింగ్ పోటీలు ప్రారంభించగా జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ జ్యోతి ప్రజల్వన చేసి పోటీలను ప్రారంభించారు. స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పావురాలను ఎగురవేసి ట్రోఫీ ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం స్విమ్మింగ్ పోటీలు ఆసక్తిగా తిలకించారు. ఆత్రేయపురం రోడ్డు నుంచి అధిక సంఖ్యలో మహిళలు రంగవల్లులు తీర్చిదిద్దారు. రాష్ట్ర నలుమూలల నుంచి తరలివచ్చిన పలువురు స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొన్నారు. అనంతరం జరిగిన సభలో మంత్రి దుర్గేష్ మాట్లాడు తూ సంక్రాంతి సంబరాల నిర్వహణకు ఎంతగానో కృషి చేసిన ఎమ్మెల్యే బండారుతో పాటు వివిధ శాఖల అధికారులను ప్రశంసించారు. గడిచిన ఐదేళ్లలో పర్యాటక రంగం అభివృద్ధి జరగలేదని, కూటమి ప్రభుత్వం పర్యాటకానికి పెద్దపీట వేస్తుందన్నారు. కోనసీమ ప్రాంతాన్ని పర్యాటకులు ఆకర్షించేలా సీఎం చంద్రబాబు టెంపుల్ టూరిజం, ఈకో టూరిజం, అడ్వెంచర్ టూరిజం, స్పోర్ట్స్ టూరిజం తీసుకువచ్చినట్టు తెలిపారు. ఎక్కడిక్కడ రిసార్ట్స్ నిర్మించాల్సి ఉందన్నారు. కలెక్టర్ మహేష్‌కుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి పోటీలు నిర్వహించడం సంక్రాంతిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు ఎంతగానో ఉల్లాసాన్ని అందించడం గర్వకారణమన్నారు. ప్రభుత్వం ఈ ట్రోఫీలకు అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ లొల్ల లాకులు, పిచ్చికలంకలను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్టు వివరించారు. ప్రతి ఏటా ట్రోఫీ పోటీలు నిర్వహిస్తామన్నారు. గోదావరి ట్రోఫీ పోటీల్లో భాగంగా నిర్వహించిన ఈత పోటీలు ఉత్కంఠ భరితంగా సాగాయి. పోటీల్లో విజేతలకు మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యే బండారు బహుమతులు ప్రదానం చేశారు. అమెరికా నుంచి సంక్రాంతి పండుగకు స్వదేశానికి వచ్చిన 70 ఏళ్ల పైబడిన వృద్ధురాలు స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొనడం విశేషం. సీఐ శివగణేష్ స్విమ్మింగ్ పోటీల్లో మొదటిస్థానం సాధించారు. వివిధ విభాగాల్లో స్విమ్మింగ్, రంగవల్లులు, పతంగి పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీకర్, ఆకుల రామకృష్ణ, కేవీ సత్యనారాయణరెడ్డి, చిలువూరి సతీష్‌రాజు, కరుటూరి నరసింహరావు, ముదునూరి వెంకట్రాజు, ముళ్ళపూడి భాస్కరరావు, ముత్యాల బాబ్జి, కంఠంశెట్టి శ్రీనివాస్, గుత్తుల రాంబాబు, జల్లి కామేశ్వరరావు, నరాలశెట్టి వెంకన్న, జుజ్జవరపు హరిబాబు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు కష్టపడండి



మాట్లాడుతున్న కిరణ్ అబ్బవరం

సినీ హీరో కిరణ్ అబ్బవరం

గండేపల్లి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మీ గోల్ నిర్ణయించుకోండి దాని కోసమే కష్టపడండి... ఆలోచించండి.. ఎవరు ఏమన్నా పట్టించుకోకుండా రీచ్ అవ్వండి అని సినీ నటుడు కిరణ్ అబ్బవరం పేర్కొన్నారు. గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్శిటీలో నిర్వహిస్తున్న కలర్స్ ఫెస్ట్ యువజనోత్సవాల్లో భాగంగా మూడోరోజు శనివారం జరిగిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. దీంతో విద్యార్థులు ఉత్సాహంగా కేరింతలు కొట్టారు. కిరణ్ మాట్లాడుతూ నేను హీరో అవుతానంటే అందరూ నవ్వారు అది పట్టించుకోకుండా ప్రయత్నం చేశాను ఇప్పుడు హీరోగా మీ ముందు ఉన్నాను. పాజిటివ్‌గా ఆలోచించాలని కోరారు. కిరణ్‌ను ఆదిత్య యాజమాన్యం శేషారెడ్డి, సతీష్‌రెడ్డి ఘనంగా సత్కరించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ కూడా పాల్గొన్నారు.



కిరణ్‌ను సత్కరిస్తున్న ఆదిత్య యాజమాన్యం

జాబ్ మేళాలో 187మందికి ఉద్యోగాలు

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 11(ఆంధ్రజ్యోతి): ఈనెల 9న కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో జరిగిన జాబ్ మేళాలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా, కాకినాడ జిల్లాలకు చెందిన ప్రభుత్వ, ప్రయివేట్ ఐటీఐ విద్యార్థులు 187 మంది ప్రముఖ కంపెనీ అమరరాజ గ్రూప్ కంపెనీస్‌లో ఉద్యోగాలు పొందినట్టు కోనసీమ జిల్లా కన్వీనర్ ప్రిన్సిపాల్ ఎంవిజి.వర్మ తెలిపారు.

వాడపల్లికి పోటెత్తిన భక్తజనం



వాడపల్లి వెంకన్న ఆలయంలో ప్రదక్షిణలు నిర్వహిస్తున్న భక్తులు

ఆత్రేయపురం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామివారికి సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మి హోమం, బాల భోగం తదితర కార్యక్రమాలను, శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామిని వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తీరువీధులలో ఏడు ప్రదక్షిణలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. స్వామిని దర్శించుకున్న భక్తులు తులభారాలు, కానుకలు సమర్పించుకుని అన్న ప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా రూ.28,76,811 ఆదాయం లభించినట్టు ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. క్యూలలో వేచి ఉన్న పిల్లలకు పాలు, బిస్కెట్లు పంపిణీ చేశారు. అనంతరం రాత్రి సత్యశ్రావణి నృత్యనికేతన్ వారిచే అందించిన ప్రదర్శన భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది.

రూ.28.76లక్షలు ఆదాయం

శృంగారవల్లభస్వామి ఆలయంలో....

పెద్దాపురం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుపతి శృంగారవల్లభస్వామి వారిని భక్తులు శనివారం దర్శించుకున్నారు. తెల్లవారుజాము నుంచే భక్తులు స్వామివారి దర్శనానికి బారులు తీరారు. ప్రత్యేక దర్శన టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.82,960, అన్నదాన విరాళాలు రూ.59,975, కేశఖండన ద్వారా రూ.2,320, తులాభారం, కానుకలు ద్వారా రూ.400, లడ్డూ ప్రసాదం విక్రయం ద్వారా రూ.15,975 వెరసి రూ.1,61,556 ఆదాయం సమకూరినట్టు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు.

నీతి అయోగ్ సదస్సులో 'శాన్ మెరైన్' ప్రాతినిధ్యం

కాకినాడ సిటీ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం ఎకానమిక్ రీజియన్ ఆధ్వర్యంలో ఈ నెల 10,11 తేదీల్లో విశాఖలో 2 రోజుల పాటు నిర్వహించిన నీతి అయోగ్-2025 సదస్సులో కాకినాడకు చెందిన శాన్ మెరైన్ సంస్థ ప్రాతినిధ్యం వహించింది. ఈ వివరాలను సంస్థ తరఫున శనివారం విడుదల చేసినఓ ప్రకటనలో వెల్లడించారు. పారిశ్రామిక అభివృద్ధిలో భాగంగా విశాఖపట్నం ఎకానమిక్ రీజియన్, నీతి అయోగ్ సంయుక్తంగా నిర్వహించిన ఈ సదస్సులో ఆదానీ, హిందూస్థాన్ షిప్ యార్డ్ వంటి సంస్థలతో కలిసి శాన్ మెరైన్ సంస్థ పాల్గొంది. నౌకా నిర్మాణాన్ని ఆంధ్రప్రదేశలో అభివృద్ధి చేయడానికి శాన్ మెరైన్ సంస్థ చేసిన సూచనలను నీతి అయోగ్ స్వీకరించింది. షిప్ బిల్డింగ్ రంగాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రధాన ఆదాయ వనరుగా మార్చడానికి భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. సదస్సులో విశాఖపట్నం, కాకినాడ, అనకాపల్లి, శ్రీకాకుళం, పార్వతీపురం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, తూర్పుగోదావరి తదితర 8 జిల్లాలను కలిపి విశాఖపట్నం ఎకానమిక్ రీజియన్‌గా ప్రతిపాదించారు. ఈ సందర్భంగా శాన్ మెరైన్ సంస్థ అధినేత షేక్ అలీషా మాట్లాడుతూ నీతి అయోగ్ సదస్సులో తాము చేసిన సూచనలు స్వీకరించడం చాలాసంతోషంగా ఉందన్నారు.

హైందవ సంస్కృతిని కాపాడాలి



పిఠాపురంలో హిందూ ఉపాధ్యాయ సమితి జాతీయ మహాసభలో ప్రమాణం చేస్తున్న ప్రతినిధులు

పిఠాపురం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): హైందవ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని పలువురు వక్తలు అన్నారు. పిఠాపురంలోని అగ్రహారంలో అనఘా దత్త క్షేత్రంలో హిందూ ఉపాధ్యాయ సమితి జాతీయ పంచమ మహాసభ శనివారం జరిగింది. మైసూరుకు చెందిన వేదపండితుడు కర్రి సంతోష్‌కుమార్ ఘనాపాఠి, హిందూ ధర్మా రక్ష సమితి అధ్యక్షుడు చెదులూరి గవరయ్య, సీనియర్ న్యాయవాది వజ్రాల చంద్రశేఖర్, ఉపాధ్యాయ సమితి జాతీయ అధ్యక్షుడు డేగల మహేష్, పెండెం శ్రీదేవి మాట్లాడారు. తెలుగురాష్ట్రాలు, తమిళనాడు, కర్నాటక, యానాం తదితర రాష్ట్రాల ప్రతినిధులు సభకు హాజరయ్యారు.

సేవ్ కల్చర్



రంగంపేటలో సేవ్ కల్చర్ అనే నినాదంతో దేవిన సిస్టర్స్ రూపొందించిన సైకతశిల్పం

ఆకట్టుకున్న దేవిన సిస్టర్స్ సైకతశిల్పం

రంగంపేట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఈనెల 12న స్వామి వివేకానంద జయంతి, జాతీయ యువజన దినోత్సవం, సంక్రాంతిని పురస్కరించుకుని సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలని (సేవ్ కల్చర్) అనే నినాదంతో తూర్పుగోదావరి జిల్లా రంగంపేటలో ప్రముఖ సైకత శిల్పి దేవిన శ్రీనివాస్ కుమార్తెలు దేవిన సోహిత, దేవిన ధన్యత శనివారం సైకతశిల్పం రూపొందించారు. 14 అడుగుల వెడల్పు, 6 అడుగుల ఎత్తు కలిగిన ఈ సైకత శిల్పాన్ని ఇద్దరూ 8 గంటలు శ్రమించి తీర్చిదిద్దారు. ఈ శిల్పంలో ఒక వైపు స్వామి వివేకానంద, మరో వైపు సంక్రాంతి వాతావరణాన్ని చూపించారు. ఈ సందర్భంగా దేవిన సిస్టర్స్‌ను పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందించారు.

ఒక్క క్షణంలో.. ఘోరం!


శంఖవరం మండలం కత్తిపూడిలో జరిగిన ప్రమాదంలో చెల్లాచెదురుగా పడిఉన్న మృతదేహాలు

- అన్నవరం దైవదర్శనానికి వెళ్తూ ఆగిఉన్న లారీని ఢీకొన్న కారు.. రెండు కుటుంబాల్లో విషాదం
- ఉదయం 7గంటల సమయంలో ప్రమాదం
- ముగ్గురి మృతి.. మరో నలుగురికి తీవ్రగాయాలు
- కాకినాడ జిల్లా కత్తిపూడి జాతీయ రహదారిపై ఘటన
- మృతులు పశ్చిమగోదావరి జిల్లా భీమవరం వాసులు

శంఖవరం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): మరొక పది కిలోమీటర్లు పయనిస్తే ఆ కుటుంబం సత్యదేవుని సన్నిధిలో సంతోషంగా ఉండేది. వారింట సంక్రాంతి సందడి మిగిలేది. దూరం నుంచి వస్తూ గమ్యానికి దగ్గరలోకి వచ్చినా మృత్యు ఒడిలోకి చేరడంతో వారికి విషాదమే మిగిలింది. కాకినాడ జిల్లా శంఖవరం మండలం కత్తిపూడిలో 16వ నెంబరు జాతీయ రహదారిపై ఆగిఉన్న లారీని కారు వెనుక నుంచి ఢీకొంది. అన్నవరం దైవదర్శనానికి వెళ్తుండగా జరిగిన ఈ ఘటనలో ముగ్గురు మృతి చెందగా నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.

తెల్లవారుజామునే బయలుదేరి..

పశ్చిమగోదావరి జిల్లా భీమవరం టౌన్‌కి చెందిన చవ్వాకుల శ్యాంప్రసాద్, అతని బావమరిది కరింశెట్టి శివన్నారాయణ, కరింశెట్టి శివన్నారాయణ భార్య దివ్య, కరీంశెట్టి సత్యనాగమధు, శ్యాంప్రసాద్ భార్య చవ్వాకుల ప్రసన్న, తల్లి అమ్మాజీ, కారు డ్రైవర్ నిమ్మగడ్డ ధనుష్ కలిసి శనివారం తెల్లవారుజామున అన్నవరం రావడానికి ఉదయం 4-5 గంటల మధ్యలో కారులో బయలుదేరారు. వీరి వాహనం ఉదయం 7 గంటల సమయంలో అన్నవరానికి దగ్గర్లోనే పది కిలోమీటర్ల ముందు కత్తిపూడి వద్దకు చేరుకుంది. అక్కడ ఆగిఉన్న లారీని వేగంగా ఢీకొంది. ఈ ఘటనలో చవ్వాకుల శ్యాంప్రసాద్(50), కరింశెట్టి శివన్నారాయణ (38), కరింశెట్టి దివ్య(30) అక్కడికక్కడే మృతి చెందగా మిగిలినవారు తీవ్రంగా గాయపడ్డారు. శ్యాంప్రసాద్ భార్య ప్రసన్న, తల్లి అమ్మాజీ అపస్మారక స్థితిలో వేర్వేరు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. డ్రైవర్ ధనుష్ మాత్రం స్వల్పంగా గాయపడ్డాడు. ఈ ప్రమాదం జరిగిన తీరు చాలా ఘోరంగా ఉంది. వీరు ప్రయాణించే ఎర్టిగా కారు నుజ్జునుజ్జవడంతోపాటు రహదారులన్నీ రక్తమోడి చూపరులు చలించిపోయారు. ఈ ప్రమాదానికి స్పష్టమైన కారణం తెలియనప్పటికీ నిద్రమత్తుగానీ, లారీని గమనించకపోవడంగానీ అయి ఉండొచ్చని భావిస్తున్నారు.

క్షతగాత్రులను స్థానికుల సహాయంతో తుని, ప్రత్తిపాడు ప్రభుత్వాస్పత్రులకు తీసుకెళ్లారు. ప్రత్తిపాడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కరీంశెట్టి శివనారాయణ మృతి చెందగా అమ్మాజీ, సత్యనాగమధులను మెరుగైన వైద్యంకోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అన్నవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆగిన లారీయే కారణం

జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీలను ఢీకొట్టడంతో తరచూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఆగి ఉన్న లారీలపై పోలీసులు చర్యలు చేపట్టకపోవడంతో ఇష్టానుసారంగా లారీలను నిలిపివేస్తున్నారు. దీంతో ఏటా పదుల సంఖ్యలో మృత్యువాత పడడంతోపాటు వందల సంఖ్యలో క్షతగాత్రులుగా మిగిలిపోతున్నారు.

భీమవరంలో విషాదఛాయలు

భీమవరం క్రైం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): చవ్వాకుల శ్యాంప్రసాద్ మృతితో భీమవరంలోని ఆయన నివాసం వద్ద విషాదఛాయలు అలముకున్నాయి. అతడు భీమవరం గన్నాబత్తుల వారివీధిలో ఉంటున్నాడు. ఆయనకు సంతానం లేరు. యనమదుర్రులో వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. అతని బావమరిది అయిన కరింశెట్టి శివన్నారాయణ కృష్ణా జిల్లా కృత్తివెన్ను మండలానికి చెందినవాడు. ఆయన కూడా ప్రస్తుతం భీమవరంలోనే ఉంటున్నారు. అతనికి కూడా సంతానం లేనట్టుగానే బంధువులు తెలిపారు.


చవ్వాకుల శ్యాంప్రసాద్ (ఫైల్‌ఫొటో)


భీమవరంలో విచారం వ్యక్తం చేస్తున్న శ్యాంప్రసాద్ బంధువులు

మధ్యాహ్నానికి వచ్చేస్తానని వెళ్లి..

అన్నవరం దేవాలయానికి వెళ్లి దర్శనఅనంతరం మధ్యాహ్నానికి ఇంటికి వచ్చేస్తామని వారి కుటుంబసభ్యులకు ముందురోజే శ్యాంప్రసాద్ చెప్పాడు. ఇప్పుడు ఆయనతోపాటు చెల్లి, బావ కూడా ముగ్గురు మృతి చెందడంతో వీరి కుటుంబీకులు దిగ్భ్రాంతికి గురయ్యారు. శ్యాంప్రసాద్‌కు అన్నదమ్ములు ముగ్గురుకాగా, పెద్దవారైన మోహన్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. రెండో సోదరుడు తాతాజీ 20ఏళ్ల క్రితం కృష్ణా పుష్కరాల్లో గల్లంతు కావడంతో అప్పటినుంచి తల్లి బెంగతోనే ఉన్నారు. మూడో సోదరుడు శ్యాంప్రసాద్ అందరినీ చూసుకుంటున్నాడు. దీంతో ఆఇంట విషాదం అలుముకుంది.

స్నేహితుడిని హత్య చేసిన వ్యక్తి అరెస్టు


కేసు వివరాలు తెలుపుతున్న సీఐ దొరరాజు

కె.గంగవరం,జనవరి 11(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లాలోని కె.గంగవరం మండలంలోని కూళ్ల గ్రామంలో సంచలనం సృష్టించిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. దీనికి సంబంధించి మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు, పామర్రు ఎస్‌ఐ జానీబాషా విలేకరులకు వివరాలు తెలిపారు. సువర్ణరత్నం, మంచాల సూర్యచంద్రరావు స్నేహితులు. సువర్ణరత్నం తన భార్యతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడనే కోపంతో సూర్యచంద్రరావు సువర్ణరత్నం అలియాస్ శివను హత్య చేసినట్లు దర్యాప్తులో తేలిందని చెప్పారు. సూర్యచంద్రరావును కూళ్ల ఏటిగట్టుమీద అరెస్టు చేశామని, రామచంద్రపురం కోర్టుకు పంపించినట్లు వారు చెప్పారు.

భార్య బుగ్గను కొరికిన భర్త అరెస్టు

గొల్లప్రోలు రూరల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ముక్కు ఊడేలా భార్య బుగ్గను కొరికి పైశాచికత్వం ప్రదర్శించిన భర్తను పోలీసులు శనివారం అరెస్టు చేశారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తి గ్రామానికి చెందిన దాసం నాగబాబు తన భార్యను పిల్లలు పుట్టలేదనే నెపంతో మానసికంగా, శారీరకంగా హింసిస్తూ ఉండేవాడు. వేరే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ నేపథ్యంలో నాగబాబు తన భార్య శేషారత్నం మెడను కొరికి చంపాలని ప్రయత్నించాడు. సాధ్యం కాకపోవడంతో బుగ్గను మాంసం ముద్ద వచ్చేలా కొరికి దాన్ని పళ్లతో పెరికివేశాడు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు నాగబాబును శనివారం తాటిపర్తిలో అరెస్టు చేశారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచనున్నట్టు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

20 ప్రైవేటు ట్రావెల్ బస్సులపై కేసులు



ప్రైవేటు ట్రావెల్ బస్సులను తనిఖీ చేస్తున్న ఆర్టీవో

రావులపాలెం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా హైదరాబాద్ నుంచి రావులపాలెం వైపు వస్తున్న ప్రైవేటు ట్రావెల్ బస్సులను తనిఖీ చేసి 20 ట్రావెల్ బస్సులపై కేసు నమోదు చేసినట్టు జిల్లా రవాణా శాఖాధికారి బి.శ్రీనివాసరావు తెలిపారు. రావులపాలెం మండలం ఈతకోట జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున ఆయన స్థానిక అధికారులతో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ప్రయాణికుల వద్ద నుంచి అధిక చార్జీలు వసూలు చేయడం, భద్రతా నియమాలు పాటించకపోవడంతో 20 బస్సులపై కేసు నమోదు చేసి రూ.74,500 అపరాధ రుసుము విధించినట్టు తెలిపారు. ఈ తనిఖీలు జనవరి 20వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు.

ధర్మవరంలో కోలాహలంగా
రాష్ట్రస్థాయి ఎడ్ల పందాలు



- సీనియర్స్‌లో గుమ్మిలేరు, జూనియర్స్‌లో ధర్మవరం ఎడ్ల జతలకు ప్రథమ బహుమతులు


ధర్మవరం- పోలవరం కాలువ గట్టులో పరుగులు పెడుతున్న ఎడ్లు

ప్రత్తిపాడు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరంలో గౌరీశంకర్ల 88వ వార్షికోత్సవం మహోత్సవాలు, సంక్రాంతి సంబరాలు పురస్కరించుకుని రాష్ట్రస్థాయి ఎడ్ల పందాలు శనివారం కోలాహలంగా ప్రారంభమయ్యాయి. ప్ర త్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా ఈ పోటీలను ప్రారంభించారు. సీనియర్స్ విభాగంలో కోనసీమ జిల్లాగుమ్మిలేరు, జూనియర్స్ వి భాగాల్లో కాకినాడ జిల్లా ధర్మవరం ఎడ్ల జతల కు బహుమతులు కైవసం చేసుకున్నాయి. ధర్మవరం పోలవరం కాలువ గట్టుపై ఏర్పాటు చే సిన రాష్ట్రస్థాయి ఎడ్లపోటీలకు విశాఖ, అనకాపల్లి, కాకినాడ, ఉభయగోదావరి, కృష్ణ జిల్లాలకు చెందిన 36 ఎడ్ల జతలు పోటీల్లో పాల్గొన్నాయి. సీనియర్స్ విభాగంలో కోనసీమ జిల్లా గుమ్మిలేరు గ్రామానికి చెందిన కోరా తేజ ఎడ్ల జతకు ప్రథమ బహుమతి, కాకినాడ జిల్లా గొల్లప్రోలు కు చెందిన నిమ్మకాయల నూకరాజు ఎడ్ల జత కు ద్వితీయ బహుమతి, కోనసీమ జిల్లా గుమ్మిలేరుకు చెందిన తేజచౌదరికి చెందిన ఎడ్ల జత కు తృతీయ బహుముతి సాధించాయి. జూనియ ర్స్ విభాగంలో కాకినాడ జిల్లా ధర్మవరానికి చెం దిన జువ్వల సత్తిబాబు ఎడ్ల జతకు ప్రథమ బ హుమతి, తూర్పుగోదావరి జిల్లా కాపవరానికి చెందిన కుంచం మనోజ్ ఎడ్ల జతకు ద్వితీయ బహుమతి, తూర్పుగోదావరి జిల్లా వడిశలేరుకు చెందిన పైడిశెట్టి రిధం వీర కృష్ణశ్రీ ఎడ్ల జతకు తృతీయ బహుమతి లభించాయి. ఈ పోటీల్లో ప్రథమ బహుమతికి రూ.15వేలు, ద్వితీయ బహుమతికి రూ.12వేలు, తృతీయ బహుమతికి రూ.8వేలు, షీల్డులను విజేతలకు అందించారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా యనమల కృష్ణ, నానాజీ, ఫణి వ్యవహరించారు.

రాష్ట్రస్థాయి ఎడ్ల పందాలు పురస్కరించుకుని ధర్మవరం పోలవరం గట్ల ప్రదేశాలు శనివారం జనసంద్రంగా మారాయి. ధర్మవరం రామభద్రరావు చెరువు పరిసరాల్లో ముందురోజే చేరుకున్న ఎడ్ల జతకు నిర్వాహకులు టెంట్లు, షామియానాలతో శిబిరాలు ఏర్పాటు చేసి భోజన వసతి సౌకర్యాలు కల్పించారు. పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే సత్యప్రభ మాట్లాడుతూ సంప్రదాయ క్రీడలు కనుమరుగవుతున్న నేటి ఆధునిక కాలంలో సంప్రదాయ క్రీడలను ప్రోత్సహిస్తున్న కమిటీని అభినందించారు. ఎన్డీయే కూటమి శ్రేణులు, నాయకులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం

- పలు రాష్ట్రాలనుంచి క్రీడాకారుల రాక
- తూర్పుగోదావరి జిల్లా వేళ్లచింతలగూడెంలో నిర్వహణ


క్రీడాకారులతో కరచాలనం చేస్తున్న గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు

గోపాలపురం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): యువత విద్యతోపాటు క్రీడానైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం వేళ్లచింతలగూడెంలో ఆర్‌అండ్‌ఎం ఫౌండేషన్ చైర్మన్ గంటా మధుకృష్ణ, ఎమ్మెల్యే మద్దిపాటి ఆధ్వర్యంలో జాతీయస్థాయి కబడ్డీ పోటీలను శనివారం రాత్రి ప్రారంభించారు. పలు రాష్ట్రాలనుంచి వచ్చిన క్రీడాకారులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం క్రీడలకు అత్యంత ప్రాధాన్య మిస్తోందన్నారు. మూడురోజులపాటు జరిగే ఈ పోటీల్లో 9 పురుషుల జట్లు, 10 మహిళా జట్లు పోటీల్లో పాల్గొంటాయన్నారు. పురుషులకు సంబంధించి విజయనగరం, శ్రీకాకుళం, విశాఖ పట్నం, తూర్పుగోదావరి, కృష్ణ, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, పశ్చిమగోదావరి జిల్లాల జట్లు, మహిళలకు సంబంధించి ఇండియన్ రైల్వే బ్లూఏ, ఇండియన్ రైల్వే ఆరెంజ్-బీ, ఆంధ్రప్రదేశ్-ఏ, తెలంగాణ-ఏ, ఉత్తరప్రదేశ్, ఢిల్లీబీ, చైనీస్, చత్తీస్‌ఘడ్-ఏ, హరియాణా-బీ, కర్ణాటక రాష్ట్రాలకు జట్లు పాల్గొంటాయన్నారు. శనివారం పురుషుల విభాగం నుంచి నెల్లూరు, ప్రకాశం జట్లు బరిలో దిగినట్టు ఎమ్మెల్యే మద్దిపాటి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌ఎం ఫౌండేషన్ చైర్మన్ గంటా మధుకృష్ణ, సీఐ నాగేశ్వర్‌నాయక్, ఎస్‌ఐ కె.సతీష్‌కుమార్, సంక్రాంతి సంబరాల కమిటీ సభ్యులు, కొర్లపాటి శ్రీరామ చంద్రమూర్తి(రాము), పిన్నమనేని చినబాబు, స్పోర్ట్స్ డైరెక్టర్స్ పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొని.. యువతి మృతి


రేణుక మృతదేహం

కాకినాడ క్రైం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): పండుగపూట ఇంటికి వెళ్లి తన కుటుంబంతో ఆనందంగా గడుపుదామనుకున్న తరుణంలో ఆ యువతిని మృత్యువు రోడ్డు ప్రమాదరూపంలో కబళించింది. కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం లంకల గన్నవరానికి చెందిన డేగల రేణుక(18) రాజమహేంద్రవరంలో డిప్లమో కోర్సు చదివింది. అనంతరం కాకినాడ జగన్నాథపురంలోని తన అమ్మమ్మ ఇంటివద్ద ఉంటూ కంప్యూటర్ కోర్సు చదువుతోంది. ఈ క్రమంలో శనివారం రాత్రి తన తాతయ్య ఏసుతో కలిసి ద్విచక్రవాహనంపై మెయిన్ రోడ్డుకు వెళ్లి కొత్త బట్టలు కొనుగోలు చేసి స్వస్థలానికి వెళ్లి నూతన వస్త్రాలు ధరించి పండగ చేసుకుందామనుకుంది. తాతతో కలిసి జగన్నాథపురం శివాలయంవద్ద ఉన్న ఇంటికి తిరుగు పయనమయ్యారు. ఈ క్రమంలో వారి వాహనం ఘాటీ సెంటర్ సమీపంలోని చేపలమార్కెట్ వద్దకు వచ్చేసరికి వేగంగా వస్తున్న లారీ వారి ద్విచక్రవాహనాన్ని బలంగా ఢీకొట్టింది. దీంతో రేణుక ఎగిరిపడి తీవ్ర గాయాలపాలై అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. అది గమనించిన స్థానికులు ఆమెను జీజీహెచ్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. అనంతరం వన్‌టౌన్ ఎస్‌ఐ స్వామినాయుడు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. కాకినాడ వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టిడ్కో ఇళ్లలో గుప్పుమన్న గంజాయి

- నిడదవోలులో 22 కిలోల స్వాధీనం
- 11 మంది యువకుల అరెస్టు


గంజాయి ముఠా వివరాలు వెల్లడిస్తున్న సీఐ తిలక్

నిడదవోలు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): నిడదవోలులో రూ.1.10లక్షల విలువైన 22 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని 11మంది యువకులను అరెస్ట్ చేసినట్టు సీఐ పీవీజీ తిలక్ అన్నారు. పోలీస్ సర్కిల్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. నిడదవోలు పట్టణ శివారు తీరుగూడెం ప్రాంతంలోని టిడ్కో ఇళ్లవద్ద గంజాయి విక్రయాలు సాగుతున్నాయనే సమాచారంతో దాడి చేసి 11మంది యువకులను అరెస్ట్ చేసి 22 కిలోల గంజాయిని సీజ్ చేశామన్నారు. ఈ సందర్భంగా సుబ్బరాజుపేటకు చెందిన డొంకా ప్రవీణ్‌కుమార్, రైల్వే క్వార్టర్స్ సమీపంలో నివాసముండే ఆముదాల రవి, దేవరపల్లికి చెందిన కొప్పాక అఖిల్‌కుమార్, పల్లంట్లకు చెందిన డొండపాటి గంగాధర్, నిడదవోలు మండలం కంసాలిపాలేనికి చెందిన ఎలిచర్ల మిథున్‌దాస్, నిడదవోలుకు చెందిన కాకి పవన్, మజ్జి భానుప్రకాష్, కాకరపర్తి మహేష్, విశాఖ జిల్లాకు చెందిన కోరా రామచంద్రరావు, ఒరిస్సా రాష్ట్రానికి చెందిన గోపీ గోలారి తదితరులను అరెస్ట్‌చేశామని సీఐ పేర్కొన్నారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై పూర్తి స్థాయిలో ప్రత్యేక దృష్టిసారించామని, అందులో భాగంగానే ఈ దాడి నిర్వహించామన్నారు. సమావేశంలో పట్టణ ఎస్‌ఐలు పి.శోభన్‌కుమార్, పరమహంస తదితరులు పాల్గొన్నారు.

అర్తమూరులో ఎరువుల వ్యాపారి
రూ.2.3కోట్ల మేర కుచ్చుటోపీ

మండపేట, జనవరి 11(ఆంధ్రజ్యోతి): అతడో ఎరువుల వ్యాపారి గ్రామంలో ఉన్న బంధువులు, స్నేహితులు అందరితో కలుపుగోలుగా ఉంటున్నట్టు నటిస్తూ చాలామంది నుంచి ఒకరికి తెలియకుండా మరొకరివద్ద వ్యాపారం కోసమని వడ్డీ ఇస్తానని నమ్మబలికి రూ2.3కోట్ల మేర అప్పుగా నగదును తీసుకుని ఊరువదిలి ఉడాయించిన వ్యాపారి ఉదంతమిది. బాధితుల కథనం ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం అర్తమూరు గ్రామానికి చెందిన గోలుగూరి గౌరిశంకర్‌రెడ్డి గ్రామంలో ఎరువుల దుకాణం నడుతున్నాడు. దుకాణానికి వచ్చే బంధువులైన రైతుల నుంచి, పరిచయం ఉన్న బాగా తెలిసిన రైతులనుంచి రూ.లక్షల్లో అప్పులు చేసి వడ్డీ చెల్లించకపోవడం, అసలు ఇవ్వకపోవడం ఆరునెలలగా జరుగుతోంది. కాగా, అతడు ఇటీవల ఎరువుల దుకాణంతోపాటు తన ఇంటికి తాళం వేసి కనిపించకుండాపోయాడు. అతడికి ఫోన్ చేసినా పనిచేయకపోవడంతో బాధితులంతా తాము మోసపోయామని గ్రహించి అర్తమూరులో వున్న అతడి ఇంటివద్ద రెండురోజులుగా ఆందోళనకు దిగారు. బంధువులు, స్నేహితులు, సన్న,చిన్నకారు రైతులే లక్ష్యంగా వారి నుంచి భారీగా నగదును అప్పుగా తీసుకుని బోర్డు తిప్పేయడంతో అసలు ఏం చేయాలో తెలియడం లేదని బాధితులు వాపోతున్నారు. అతడి కుటుంబసభ్యులు కూడా తమకు సమాధానం చెప్పడం లేదని బాధితులు వాపోతున్నారు. ఇప్పటివరకు 40మంది వరకు అప్పులు ఇచ్చిన బాధితులు ఉన్నారని తెలుస్తోంది. ఇక చేసేదిలేక వ్యాపారికి చెందిన ఇంటికి తాళంవేశారు. శనివారం బాధితులు అంతా అర్తమూరులో పరారీలో ఉన్న రెడ్డి ఇంటివద్ద ఆందోళన చేశారు.

కూలి పనులు చేసుకుని జీవనం సాగించే సన్న, చిన్న కారులతోపాటు చాలామంది వద్ద ఒకరికి తెలియకుండా మరొకరినుంచి భారీగా నగదును అప్పులుగా చేసి గ్రామంలో పత్తాలేకుండా వ్యాపారి పోవడంతో అసలు ఏం చేయాలో తెలియని పరిస్థితిలో బాధితులు ఉన్నారు. తమకు జరిగిన నష్టం మోసపోయిన వ్యవహారంపై బాధితులు పోలీసులను ఆశ్రయించేందుకు సిద్ధమవుతున్నారు. గ్రామంలో ఎరువులు వ్యాపారం నిర్వహించే వ్యాపారి బారిన ఎరువులు సరఫరా చేసిన సంస్థల ప్రతినిధులు కూడా ఉన్నారు. తాము కూడా భారీగా నగదు అప్పుగా ఇచ్చామని వారు లబోదిబోమంటున్నారు.


పోలవరం ప్రాజెక్టు పనులు పరిశీలించిన
పార్లమెంట్ కమిటీ సభ్యులు

రాత్రికి రాజమండ్రిలో సందడి

రాజమహేంద్రవరం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): పార్లమెంటరీ జలశక్తి స్టాండింగ్ కమిటీ సభ్యులైన 11మంది ఎంపీలు శనివారం పోలవరం ప్రాజెక్టు పనులను పరిశీలించారు. కమిటీ చైర్మన్ రాజీవ్ ప్రతాప్ రూడీ ఆధ్వర్యంలో ఎంపీలు శుక్రవారం రాత్రి రాజమండ్రి వచ్చిన సంగతి తెలిసిందే. శనివారం ఉదయం వెళ్లి తిరిగిరాత్రికి రాజమండ్రికి చేరుకున్నారు. ఆదివారం ఉదయం విమానాశ్రయం నుంచి తిరిగి తమ ప్రాంతాలకు చేరుకుంటారు. ఈ ఎంపీల బృందం ముందుగా పోలవరం ప్రాజెక్టులోని స్పిల్‌వే ప్రాంతాన్ని సందర్శించింది. తర్వాత ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లను పరిశీలించి, ఎర్త్‌కమ్ రాక్‌ఫిల్ డ్యామ్ కట్టే ప్రాంతంలో నిర్మించనున్న డయాఫ్రంవాల్ గురించి ఆరా తీశారు. ఫొటో ఎగ్జిబిషన్లను కూడా పరిశీలించారు. ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి సాయిప్రసాద్,పోలవరం ఈఎన్‌సీ మామిడి వెంకటేశ్వరరావు ప్రాజెక్టు గురించి వివరించారు. ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లు, డయాఫ్రంవాల్ గురించి ఎక్కువగా అడగడం గమనార్హం. ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లు ఎందుకనే సందేహాన్ని కూడా వెలిబుచ్చినట్టు సమాచారం.

అన్యమత ప్రచారాన్ని ప్రశ్నించిన వారిపై దౌర్జన్యం

బండారులంకలో ఉద్రిక్తత.. సద్దుమణిగిన వివాదం


బండారులంకలో ఏజీ రోడ్డుపై ఆందోళనకు దిగిన కార్యకర్తలు

అమలాపురం రూరల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): అన్యమత ప్రచారాన్ని అడ్డుకున్న వారిపై దౌర్జన్యానికి దిగడంతో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. పోలీసులు రంగప్రవేశం చేసి దౌర్జన్యానికి దిగిన వారితో క్షమాపణ చెప్పించడంతో వివాదం సద్దుమణిగింది. ఈ ఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలివి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ బండారులంక బ్యాంకు కాలనీ వీధికి ఒక మతానికి చెందిన వారు ప్రత్యేక బస్సులో చేరుకున్నారు. అక్కడినుంచి ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు పంచుతూ మత ప్రచారం చేశారు. అక్కడే ఉంటున్న బళ్లసాయినాగమల్లేశ్వరరావు కుటుంబం వద్దకు వచ్చేసరికి ఆయన ఎందుకు అన్యమత ప్రచారం చేస్తున్నారని ప్రశ్నించారు. దీంతో ఆగ్రహించిన వారు ఒక్కసారిగా దౌర్జన్యానికి దిగారు. వారికి, స్థానికులకు మధ్య తోపులాట జరిగి ఉద్రిక్త పరిస్థితి చోటుచేసుకుంది. సీఐ డి.ప్రశాంత్‌కుమార్, ఎస్‌ఐ వై.శేఖర్‌బాబు ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పలువురు నాయకులు రోడ్డుపై బైఠాయించారు. పోలీసులు ఆందోళనకారులతో చర్చలు జరిపి అవతలి వర్గం వారితో క్షమాపణ చెప్పించడంతో వివాదం సద్దుమణిగింది.

బావిలో పడి వ్యక్తి అనుమానాస్పద మృతి

పిఠాపురం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో బావిలో పడి వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మరణించి ఉండగా శనివారం పోలీసులు కనుగొన్నారు. పట్టణంలోని మాధవపురం రైల్వే అండర్‌పాస్ బ్రిడ్జిసమీపంలోని బావిలో పడి కుళ్లిపోయి ఉన్న యువకుడి మృతదేహాన్ని వెలికితీశారు. ఇతనిని ఇందిరానగర్‌కు చెందిన గారా జాన్(43)గా గుర్తించారు. ఎలా మరణించాడన్న అంశంపై పిఠాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

రేపు 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ' రద్దు

కలెక్టరేట్(కాకినాడ), జనవరి 11(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం నిమిత్తం ఏర్పాటు చేయబడిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం ఈనెల 13న తేదీన సోమవారం పండుగ సందర్భంగా రద్దు చేసినట్టు జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

కోడి పందాలు నిర్వహిస్తే చర్యలు

పోలీసుల హెచ్చరిక



సర్పవరం జంక్షన్: తిమ్మాపురంలో నిర్వాహకులకు కౌన్సిలింగ్ చేస్తున్న తహశీల్దార్, ఎస్ఐ

సర్పవరం జంక్షన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు ఆదేశాల మేరకు కోడి పందాలు, గుండాట, జూదం నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని మండల తహశీల్దార్ కుమారి, ఎస్ఐ ఎంవీవీ రవీంద్రబాబు హెచ్చరించారు. శనివారం మండల పరిధిలో తిమ్మాపురం, పండూరు తదితర గ్రామాల్లో పర్యటించి నిర్వాహకులకు అవగాహన కల్పించారు. సంప్రదాయ క్రీడలతో కుటుంబ సభ్యులతో సంక్రాంతిని ఆనందంగా జరుపుకోవాలని, లేదంటే నిర్వాహకులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

కేసులు నమోదు చేస్తాం

కొత్తపల్లి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామాల్లో కోడి పందాలు, జూదాలు, గుండాట నిర్వహిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని కొత్తపల్లి ఎస్ఐ జి.వెంకటేష్ అన్నారు. సంప్రదాయ పద్ధతిలో సంక్రాంతి పండుగను చేసుకోవాలని.. మండలంలో కోడి పందేలు, జూదాలు, గుండాట నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

ఉపేక్షించేది లేదు

తాళ్లరేవు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో సంక్రాంతి సందర్భంగా కోడి పందాలు, పేకాట, గుండాటలు ఆడితే ఉపేక్షించేది లేదని కోరింగ ఎస్ఐ పి.సత్యనారాయణ తెలిపారు. తాళ్లరేవు, చొల్లంగిపేట, సుంకరపాలెం, నీలపల్లి, పటవల, జి.వేమవరంలో కోడి పందాల బరులను పరిశీలించి ఆడితే చర్యలు తప్పవని నోటీసు బోర్డులు ఏర్పాటు చేశారు.



కరప మండలం కొరుపల్లి పరిధిలో కోడిపందాల బరి ఫెన్సింగ్‌ను తొలగిస్తున్న అధికారులు

పోలీసులు దాడులు

కరప, జనవరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు కోడిపందాల బరులపై శనివారం పోలీసులు, రెవెన్యూ అధికారులు దాడులు నిర్వహించారు. కొరుపల్లి, గురజనాపల్లి, గొర్రిపూడి, కొంగోడు గ్రామాల్లో నిర్వాహకులు ఏర్పాటుచేసిన పందెం బరులను ట్రాక్టర్‌తో దున్నించి ధ్వంసం చేశారు. బరుల చుట్టూ ఏర్పాటుచేసిన ఫెన్సింగ్, రాటలు, టెంట్‌లను తొలగించారు. ఆయా బరుల వద్ద హెచ్చరిక ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి నిర్వాహకుల వివరాలను సేకరించారు. ఎస్ఐ తోట సునీత, తహశీల్దార్ నందిపాటి సత్యనారాయణ మాట్లాడుతూ కోడిపందాలు, పేకాట, గుండాట, రికార్డింగ్ డాన్స్‌లు ఆడడం చట్టవిరుద్ధమని, నిబంధనలను ఉల్లంఘించి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. వేళంగి, యండమూరు, వేములవాడ, విజయరాయుడుపాలెం గ్రామాల్లో కోడిపందాల బరులను తొలగిస్తామన్నారు. నడకుదురు వెటర్నరీ అసిస్టెంట్ డాక్టర్ రవికిరణ్, ఏఎస్ఐ వి.సూరిబాబు పాల్గొన్నారు.

రోజా నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలి

మాజీ మేయర్ సుంకర పావని

కాకినాడ సిటీ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లను విమర్శించే స్థాయి రోజాకి లేదని, నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడితే రోజాకు పద్ధతిగా ఉంటుందని మాజీ మేయర్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుంకర పావని హెచ్చరించారు. శనివారం పావని మీడియాతో మాట్లాడుతూ దురదృష్టవశాత్తు జరిగిన తిరుపతి ఘటనను రాజకీయంగా వాడుకోవాలనుకుంటున్న నీచులు జగన్‌రెడ్డి, రోజా అని విమర్శించారు. వైసీసీ ప్రభుత్వ హయాంలో తిరుపతి రుయా ఆసుపత్రిలో ఆక్సిజన్ అందక 11మంది మరణిస్తే ప్రశ్నించిన వారిని అరెస్టుచేయించిన రోజా ఇప్పుడు మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. అలాగే ఎల్‌జీ పాలిమర్స్‌లో విషవాయువు లీకై 13మంది మరణించారని, అన్నమయ్య ప్రాజెక్టు దుర్ఘటనలో 33 మంది మరణించారని, కచ్చులూరు బోటు ప్రమాదంలో 46 మంది జలసమాధి అయ్యారని, జంగారెడ్డిగూడెంలో కల్తీ సారా తాగి 27 మంది మరణించారని పేర్కొన్నారు. అప్పుడు లెగని నోరు ఇప్పుడు లెగుస్తోందని, అదుపు తప్పి మాట్లాడితే రోజాకు చెప్పు దెబ్బలు తప్పవని పావని హెచ్చరించారు.

'వ్యర్థాల కాలుష్యంతో మత్స్య సంపదకు నష్టం'

కాకినాడ సిటీ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ తీర ప్రాంతంలో అనేక రకాల పరిశ్రమల వ్యర్థాల కాలుష్యం వల్ల ఇక్కడ గల అపారమైన మత్స్య సంపదకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని, తక్షణం ప్రభుత్వ యంత్రాంగం కాలుష్య నివారణ చర్యలు తీసుకోవాలని జనసేన నాయకుడు మల్లాడి రాజేంద్రప్రసాద్ విజ్ఞప్తి చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సముద్ర తీరం వెంబడి పరిశ్రమల వ్యర్థాలను శుద్ధి చేసి కాలుష్య నియంత్రణ నిబంధనల ప్రకారం నిర్దేశిత ప్రాంతాల్లో వదిలేలా చేయాలన్నారు. తద్వారా మత్స్య సంపదను విఘాతం కలుగకుండా చర్యలు చేపట్టాలన్నారు. కాలుషిత వ్యర్థాల వల్ల అంతరించిపోతున్న ఆలివ్ రిడ్లీ తాబేళ్లను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కాలుష్య వ్యర్థాల వల్ల మత్స్య సంపద అంతరించి ఉపాధి లేక మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలపై త్వరలో డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌కు నివేదిక అందజేయనున్నామని మల్లాడి తెలిపారు.

పిఠాపురంలో వాహన తనిఖీలు

పిఠాపురం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఉప్పాడ సెంటర్‌లో శనివారం రాత్రి పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. కాకినాడ డీఎస్పీ రఘువీర్, సీఐ శ్రీనివాస్, సర్కిల్‌లోని ఎస్ఐలు, పోలీసులు, క్యూఆర్‌టీ టీమ్‌లతో కలిసి డ్రంక్ డ్రైవ్ తో వాహన తనిఖీలు జరిపి మద్యం తాగి ఉన్న వారి, ర్యాష్ డ్రైవింగ్, ట్రిబుల్ రైడ్ చేస్తున్న వాహనాలతో పాటు సరైన పత్రాలు లేని వాహనాలను సీజ్ చేశారు. పిఠాపురంలో పోలీసుల ఉదాసీన వైఖరిపై డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆగ్రహం వ్యక్తం చేసిన నేపథ్యంలో తనిఖీలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

ఆటో చోరీ

పిఠాపురం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పోలీసుస్టేషన్‌కు సమీపంలో విరవాడ రోడ్డులో గల కొబ్బరితోటలో శుక్రవారం రాత్రి ఉంచిన ఆటో చోరీకి గురైనట్టు కుండల బాబూరావు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై పోలీసులు శనివారం రాత్రి కేసు నమోదు చేశారు. వారంక్రితం ఇదే ప్రాంతంలో ఒక మోటార్‌సైకిల్ చోరీకి గురైంది.

హరీష్‌కు డాక్టరేట్

కాకినాడ రూరల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): కాకినాడ బాబు పెరల్స్ అధినేత శానం హరీష్‌కు గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. దశాబ్ద కాలం నుంచి పలువురు పేదలకు ఆపరేషన్లు, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న చిన్నారులకు వైద్య సహాయం చేశారు. ఆయన చేస్తున్న సేవలకు గుర్తింపుగా గౌరవ డాక్టరేట్‌ను అందుకున్నట్టు హరీష్ తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు



రామారావు (ఫైల్)

సామర్లకోట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన కట్టమూరు రామారావు (75) గత 3రోజులుగా కనిపించకుండా ఎటో వెళ్లిపోయాడని కుటుంబ సభ్యులు సామర్లకోట పోలీసులకు ఫిర్యాదు చేశారు. బంధువుల ఇళ్ల వద్ద గాలించినా ఏఫలితం లేకపోవడంతో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆచూకీ లభిస్తే 9492314822, 8522848283కు తెలియజేయాలని పోలీసులు కోరారు.

చీడిగలో కబడ్డీ పోటీలు

కాకినాడ రూరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): చీడిగలో కూటమి నాయకుల ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కబడ్డీ పోటీలను నిర్వహించారు. జిల్లా స్థాయి పోటీలను రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, కాకినాడ డీఎస్పీ రఘువీర్, రూరల్ సీఐ సీహెచ్ చైతన్యకృష్ణ, ఏఆర్ ఏఎస్పీ శ్రీనివాసరావు టీడీపీ కోకోఆర్డినేటర్ కటకంశెట్టి ప్రభాకర్ ఇంద్రపాలెం ఎస్ఐ ఎం.వీరబాబు ముఖ్య అతిథులుగా ప్రారంభించారు. పలువురు క్రీడాకారులను పరిచయం చేసుకుని కబడ్డీ పోటీలను వీక్షించారు. టీడీపీ, జనసేన నాయకులు అప్పన్న, మహేష్, శ్రీనివాసరావు, రాంబాబు, వెంకటేశ్వరరావు, నెహ్రూ పాల్గొన్నారు.

జనసేనలో చేరికలు

కలెక్టరేట్ (కాకినాడ), జనవరి 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ 17వ డివిజన్‌లో ఆర్యన్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ అధినేత చోడిపల్లి తిరుమలరావు, చోడిపల్లి సోఫియాల ఆధ్వర్యంలో సుమారు 300మంది జనసేన పార్టీలో చేరారు. ఉపముఖ్యమంత్రి పవన్‌ను ఆదర్శంగా తీసుకుని జనసేనలోకి చేరామని ప్రకటించారు. రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ ఛైర్మన్ తోట సుధీర్ సమక్షంలో జనసేనలో చేరారు. కార్యక్రమంలో డివిజన్ పెద్దలు చోడిపల్లి శ్రీను, పిరాధి, మల్లేశ్వరరావు, కారేకొండ, ప్రతాప్, సంపత్, గణేష్, చోడిపల్లి కాశీరావు పాల్గొన్నారు.

ఎండీయూ ఆపరేటర్ సస్పెన్షన్

సామర్లకోట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఎండీయూ ఆపరేటర్ల నుంచి సివిల్ సప్లయ్ కార్యాలయానికి మామూళ్లు ఇవ్వాలంటూ సామర్లకోట మండలంలో ఎండీయూ ఆపరేటర్లు, రేషన్ డీలర్ల నుంచి రూ.200 చొప్పున అక్రమ వసూళ్లు చేసినట్టు ఆరోపణలకు గురైన సామర్లకోట ఎండీయూ ఆపరేటర్ల సంఘ అధ్యక్షుడు దరిశిపాటి సత్యానందాన్ని ఎండీయూ ఆపరేటర్ విధుల నుంచి తప్పిస్తూ కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లిబాబు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆర్డీవో ఉత్తర్వులు శనివారం సామర్లకోట తహశీల్దార్ కార్యాలయానికి చేరుకున్నాయి. ఆంధ్రజ్యోతిలో శుక్రవారం ఈ విషయంపై కథనం ప్రచురితమైన విషయం విదితమే. జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు సామర్లకోట తహ శీల్దార్ చంద్రశేఖరరెడ్డి సమగ్ర దర్యాప్తు నిర్వహించి నివేదికలను అందజేయడం జరిగింది. దీంతో జేసీ ఆదేశాలతో సత్యానందాన్ని ఎండీయూ ఆపరేటర్ విధుల నుంచి తప్పించారు.

సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి

● కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ● పలుచోట్ల సంక్రాంతి సంబరాలు ● ముగ్గులు, క్రికెట్ పోటీలు





కాకినాడ సిటీ: భోగి మంటను వెలిగిస్తున్న ఎమ్మెల్యే కొండబాబు, సర్పవరం జంక్షన్: ఎద్దుల బండి ఎక్కిన ఎమ్మెల్యే నానాజీ



గొల్లప్రోలులో క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న మర్రెడ్డి శ్రీనివాసరావు

కాకినాడ సిటీ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతీ, సంప్రదాయాలకు సంక్రాంతి పండుగ ప్రతీకని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. 10వ డివిజన్ ఇన్‌చార్జి మూగు రాజు ఆధ్వర్యంలో స్థానిక దుమ్ములపేటలో శనివారం నిర్వహించిన సంక్రాంతి సంబరాలు, ముగ్గుల పోటీలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. భోగి మంటను వెలిగించి హరిదాసు వేషధారుడిని, గంగిరెద్దును, ముగ్గులను తిలకించారు. కొండబాబు మాట్లాడుతూ సంక్రాంతి పండుగలు అంటే ప్రతీ ఇంటిలో ఆనందం వెల్లివిరుస్తుందన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో 12వ డివిజన్ మాజీ కార్పొరేటర్ తుమ్మల సునీత రమేష్, తెలుగుయువత అధ్యక్షుడు చింతలపూడి రవి, 10వ డివిజన్ నాయకులు చోడిపల్లి సతీష్, కోమటి మసేనమ్మ, మూగు చిన్ని, కోమటి నూకరాజు, మాదే అంద్రయ్య, ఎరిపల్లి నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

అందరూ ఐక్యంగా ఉంటూ సంఘం అభివృద్ధికి కృషి చేయాలని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. స్థానిక వార్ఫ్ రోడ్‌లో గల ది కాకినాడ మినీ గూడ్స్ లారీ అండ్ వ్యాన్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం డ్రైవర్లకు పండుగ నగదు కానుక పంపిణీ నిర్వహించారు. కార్యక్రమానికి సంఘం అధ్యక్షుడు చొక్కా నానాజీ అధ్యక్షత వహించగా ఎమ్మెల్యే కొండబాబు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. సంఘ కార్యాలయ ఆవరణలోని వినాయకుని ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సంఘం సభ్యులు మంచి ఆలోచనతో పండుగ కానుకగా నగదును ఇవ్వడం అభినందనీయమన్నారు. కొండబాబును శాలువాతో సత్కరించారు. టీఎస్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు గదుల సాయిబాబు, అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు చొక్కా నానాజీ, పిల్లి రాముడు, కోశాధికారి గరగ వీరకుమార్, ఉపాధ్యక్షుడు పరిమి రామారావు, సంయుక్త కార్యదర్శి బందం బాబు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

జ్ఞాపకాలు గుర్తుకొస్తున్నాయి

సర్పవరం జంక్షన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): తెలుగు ప్రజల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా సంక్రాంతి పండుగ నిలుస్తోందని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ అన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా శనివారం జనసేన గ్రామ అధ్యక్షుడు జీని శ్రీనివాస్ ఆధ్వర్యంలో మహిళలకు రంగ వల్లుల పోటీలు నిర్వహించారు. మహిళలు, విద్యార్థులు ఆకర్షణీయమైన రంగ వల్లులు వేశారు. ఈ సందర్భంగా కాడెద్దుల బండి, భోగి మంటలు వేశారు. భోగిమంటలు, గొబ్బెమ్మలు, రంగ వల్లులు, హరిదాసు, గోదాదేవి, కృష్ణుడు, సోదమ్మ, బుడబుక్కలోడు, కొమ్మదాసరుడు వంటి వేషధారణలతో మహిళలు అబ్బురపరిచారు. పల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు అలరించాయి. పోటీల్లో రాణించిన మహిళలకు ఎమ్మెల్యే నానాజీ బహుమతులు అందించారు. ఆయన మాట్లాడుతూ సంక్రాంతి సంబరాలు చూస్తుంటే చిన్ననాటి తీపి జ్ఞాపకాలు గుర్తుకువస్తున్నాయన్నారు. కూటమి నాయకులు జీని శ్రీనివాస్, తాతపూడి రామకృష్ణ, పండునాయుడు, సలాది శ్రీనివాసబాబు, పాండ్రంగి రాజు గ్రామ కార్యదర్శి సత్యనారాయణ మూర్తి, సర్పవరం సీఐ బి.పెద్దిరాజు ఉన్నారు.

క్రీడలకు ప్రోత్సాహం

గొల్లప్రోలు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): పండుగల సందర్భంగా జరిగే సంప్రదాయ క్రీడలకు ప్రోత్సాహం అందిస్తామని జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు తెలిపారు. గొల్లప్రోలు పట్టణ శివారులోని హెలిప్యాడ్ మైదానంలో జరుగుతున్న జీపీఎల్-3 క్రికెట్ టోర్నమెంట్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. కొంత సమయం క్రికెట్ ఆడారు. మార్నింగ్ క్రికెటర్స్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ టోర్నీలో గోదావరి ప్రాజెక్టు కమిటీ చైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్, జనసేన నాయకులు కడారి తమ్మయ్యనాయుడు, తెలగంశెట్టి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆనందంగా గడపాలి

గొల్లప్రోలు రూరల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను కుటుంబసభ్యులతో ఆనందంగా గడపాలని గొల్లప్రోలు ఎస్ఐ ఎన్.రామకృష్ణ సూచించారు. గొల్లప్రోలు మండలం తాటిపర్తి గ్రామంలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో శనివారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఇందులో భాగంగా జరిపిన క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలకు బహుమతులు అందజేశారు. జూదాలు, కోడిపందేలు జోలికి వెళ్లవద్దని కోరారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది అమ్మిరాజు, గోవిందు, శ్రీను పాల్గొన్నారు.

తాళ్లరేవు: కోరింగ బాలభారతి స్కూల్లో సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. విద్యార్థులు వేషధారణలతో ఆకట్టుకున్నారు. పాఠశాల యాజమాన్యం పితాని బాలవెంకటరమణ సిబ్బందికి నూతన వస్త్రాలను బహూకరించారు.

మహిళలకు ముగ్గుల పోటీలు

సర్పవరం జంక్షన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ సర్పవరం భావనారాయణ ఎస్టేట్‌లో శనివారం బాలదుర్గ షణ్ముఖ భావనారాయణ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు దినవహి పేర్రాజు (పేరుబాబు) ఆధ్వర్యంలో మహిళలకు రంగ వల్లుల పోటీలు నిర్వహించారు. సంక్రాంతి పురస్కరించుకుని నిర్వహించిన ముగ్గుల పోటీల్లో రాణించిన ప్రథమ బహుమతి సాధించిన మల్లాది వెంకట పాల్గుణ లక్ష్మికి రూ.5వేలు నగదు, ద్వితీయ బహుమతి కింద భమిడిపాటి సుందరికి రూ.3వేలు, తృతీయ బహుమతిగా రూ.2000 నగదును సంఘం అధ్యక్షుడు పేరుబాబు, భావనారాయణ ఎస్టేట్ నిర్వాహకులు యార్లగడ్డ గోపాలకృష్ణ, పెనుమత్స లక్ష్మీపార్వతిల చేతులమీదుగా అందించారు. సంఘం సెక్రటరీ ఆకెళ్ల సత్యనారాయణ, రామారావు, మంజులూరు అనంతలక్ష్మి, తాడేపల్లి ప్రసాద్, వద్దిపర్తి నరసింహరావు, దినవహి వెంకట్, దీపిక, సావిత్రి పాల్గొన్నారు. పోటీలో 30 మంది మహిళలకు కన్సలేషన్ బహుమతులు అందజేశారు.

ముగ్గుల పోటీలు

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 11(ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ పార్కు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. టీడీపీ 41వార్డు ఇన్‌చార్జి జొన్నాడ వెంకటరమణ పర్యవేక్షించారు. ప్రథమ స్థానంలో ఎం.పద్మ, ద్వితీయస్థానంలో ఎ.కుమారి, తృతీయ స్థానంలో భాగ్యలక్ష్మి నిలిచారు. వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పి.సురేష్,జనరల్ సెక్రటరీ ఆంజనేయులు బహుమతులందించారు.

పోటాపోటీగా కోడిపందాల బరులు

రెండు రోజులు ముందుగానే ఏర్పాట్లు

అటువైపు చూడని పోలీసులు

హెచ్చరికలు, అవగాహనా కార్యక్రమాలకే పరిమితం



పిఠాపురం దత్తనగర్‌లో కోడిపందాల శిబిరం



పిఠాపురం వైఎస్సార్ గార్డెన్స్‌లో సిద్ధం చేస్తున్న బరి

పిఠాపురం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): గ్రామాలు, పట్టణాల బేధం లేకుండా పోటాపోటీగా కోడి పందాల బరులు సిద్ధమవుతున్నాయి. కూటమిలో ఉన్న టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో ఆ పార్టీల నేతలు ఎవరికి వారే పందేలు నిర్వహించాలని పట్టుదలతో ఉండటంతో ఏమి జరుగుతుందోనన్న ఉత్కంఠ ప్రారంభమైంది. రెండు రోజులుగా ముందుగానే బరులు సిద్ధం చేసినా పోలీసులు మాత్రం అటువైపు చూడటం లేదు. కేవలం హెచ్చరికలు, అవగాహనా కార్యక్రమాలకే పరిమితమయ్యారు. కోడిపందేలా వ్యవహారంలో ఇప్పటికే లక్షలాది రూపాయిలు చేతులు మారుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కోడిపందేలు, జూదాలు, గుండాట నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు చేసిన పోలీసులు మౌనం పాటిస్తున్నారు. హెచ్చరికలు, అవగాహనా సమావేశాలు నిర్వహించడం తప్ప కోడిపందాల బరులు సిద్ధమవుతున్నా పట్టించుకోవడం లేదు. పిఠాపురంతో పాటు పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాల్లో టీడీపీ, జనసేన నేతలు కోడిపందేల నిర్వహణకు సిద్ధమవుతున్నారు. పిఠాపురంలో ఇప్పటికే బరులు, చుట్టూ కర్రలతో బారీకేడ్లు ఏర్పాటు చేయడంతో పాటు టెంట్లు వేశారు. పట్టణంలోని దత్తనగర్, వైఎస్ఆర్ గార్డెన్స్‌లో ఇవి సిద్ధమయ్యాయి. నివాసగృహాల చెంతనే ఈ బరులు ఏర్పాటు చేసి 2 రోజులుగా పనులు నిర్వహిస్తున్నా పోలీసులు కనీసం అటువైపు చూడలేదు. 3 మండలాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. పిఠాపురంలో ఏర్పాటు చేసిన ఒక కోడిపందాల శిబిరం వద్ద గుండాట, ఇతర జూదాల నిర్వహణకు ఒక వ్యక్తి రూ.21లక్షలు చెల్లించేందుకు ముందుకు రావడం గమనార్హం. పిఠాపురంతో పాటు మండలంలోని పి.దొంతమూరు, చిత్రాడ, విరవ, విరవాడ, ఎఫ్‌కేపాలెం, కందరాడ, జల్లూరు, జములపల్లి తదితర గ్రామాలు, గొల్లప్రోలు పట్టణంతో పాటు చేబ్రోలు, దుర్గాడ, తాటిపర్తి, వన్నెపూడి, చెందుర్తి తదితర గ్రామాల్లోనూ, కొత్తపల్లి మండలంలోనూ పందాలు నిర్వహణకు ఇప్పటికే ఏర్పాట్లు జరుగుతున్నాయి.

భారీగా వసూళ్లు

పందాలపేరుతో ఎక్కడికక్కడ భారీగా వసూళ్లు జరుగుతున్నాయి. పోలీసు, రెవెన్యూ అధికారులతో పాటు ఇతరఖర్చుల నిమిత్తం ఇప్పటికే నిర్వాహకులు భారీగా సొమ్ములు వసూలు గుండాటలు, జూదాలు, మద్యం బెల్ట్‌షాపుల నిర్వహణను అప్పగిస్తున్నారు. టీడీపీ, జనసేన నాయకుల మధ్య పోటీ నెలకొన్న నేపథ్యంలో వివాదాలు వచ్చే అవకాశం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. నెలరోజులుగా హెచ్చరికలు, బైండోవర్ కేసులతో హడావిడి చేసిన పోలీసులు ఇప్పుడు కోడిపందేలు నిర్వహిస్తే ఏమి చే స్తారా అనే అంశంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

ముగిసిన సప్తాహ మహోత్సవం

కరప, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక మెరకవీధి రామాలయం వద్ద శ్రీరామ నామ సప్తాహ మహోత్సవ వేడుకలు శనివారంతో ముగిశాయి. శాంతి హోమం నిర్వహించి అన్నసంతర్పణ చేశారు. సప్తాహ మహోత్సవాన్ని విజయవంతంగా నడిపించిన భజన విద్వాంసుడు పెద్దిరెడ్డి గోవిందు దంపతులను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఆలయ కమిటీ నిర్వాహకుల ఆధ్వర్యంలో గ్రామస్తుల సహకారంతో ఏడేళ్లుగా ఈ సప్తాహ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు పెద్దలు తెలిపారు. ఆలయకమిటీ నిర్వాహకులు దేవు జమిందారు, దేవు వీరబాబు, మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు, నక్కా సత్తిబాబు, నక్కా శ్రీనివాస్, నక్కా సాంబయ్యవెంకటరమణ పాల్గొన్నారు.



గోవింద్ దంపతులకు సత్కారం

వివిధ కేసుల్లో పలువురు బైండోవర్

కాకినాడ క్రైం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా పోలీసులు నమోదు చేసిన వివిధ కేసుల్లో పలువురిని బైండోవర్ చేసినట్లు ఎస్పీ విక్రాంత్‌పాటిల్ శనివారం రాత్రి విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. కాకినాడ పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో కాకినాడ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పీడీఎస్ బియ్యానికి సంబంధించి ఇద్దరిని, గ్యాంబ్లింగ్ కేసులకు సంబంధించి 54 మందిని బైండోవర్ చేశారు. కాకినాడ టూటౌన్ పోలీస్‌స్టేషనకు సంబంధించి గ్యాంబ్లింగ్ కేసుల్లో 11 మందిని బైండోవర్ చేసారు. త్రీటౌన్ పోలీస్‌స్టేషనకు సంబంధించి పీడీఎస్ బియ్యం కేసుల్లో ముగ్గురిని, గ్యాంబ్లింగ్ కేసుల్లో 13 మందిని బైండోవర్ చేశారు. కాకినాడ పోర్టు పోలీస్‌స్టేషన్ పరిధిలో పీడీఎస్ బియ్యానికి సంబంధించి 8 మందిని గ్యాంబ్లింగ్ కేసులకు సంబంధించి 17మందిని బైండోవర్ చేశారు. పలుచోట్ల బైండోవర్ చేశామని, పండుగ సమయంలో ఎవరైనా అసాంఘిక కార్యకలపాలకు పాల్పడితే ఉపేక్షించబోమన్నారు.

19న రేషన్ డిపోల భర్తీ దరఖాస్తుదారులకు పరీక్ష

కాకినాడ సిటీ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ డివిజన్ పరిధిలోని పది మండలాల్లో 96 ఖాళీ రేషన్ డిపోల భర్తీకి 800 పైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని, ఈనెల 12న అభ్యర్థులకు తహశీల్దార్ల ద్వారా హాల్ టిక్కెట్లు జారీ చేసి, 19న ఉదయం 10.30 నుంచి 12 గంటల వరకు కాకినాడ పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పీఆర్ జూనియర్ కళాశాలలో రాత పరీక్ష నిర్వహిస్తామని, అర్హత మార్కులు సాధించినవారికి మౌఖిక పరీక్షకు పిలుస్తామని ఆర్డీవో మల్లిబాబు తెలిపారు.

తీరంలో ఈదురుగాలులు

చలితో వణికిపోతున్న ప్రజలు

కొత్తపల్లి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడి అల్పపీడన ప్రభావంతో తీరప్రాంతాల్లో శనివారం ఉదయం నుంచి ఈదురుగాలులు వీస్తున్నాయి. తూర్పు నుంచి గాలులకు చలికాలం తోడు కావడంతో రెట్టింపు చలితో ప్రజలు వణికిపోతున్నారు. వృద్ధులు చలికి తట్టుకోలేక తలపాగాలు, కోట్లు ధరించి ఇంటి పట్టునే ఉంటున్నారు. పగలు కూడా మంటలు వేసుకుని చలి నుంచి ఉపశమనం పొందుతున్నారు. ఇదిలా ఉండగా కోనపాపపేట నుంచి ఉప్పాడ వరకు తీరప్రాంతాలకు చెందిన మత్స్యకారులు ఈదురుగాలులకు స్వచ్ఛందంగా వేటను విరమించారు. ఈ ఏడాది ఎన్నడూ లేని విధంగా వరుసగా అల్పపీడనాలు సంభవించడంతో తీరప్రాంత మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు

'టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులకు మద్దతు'

కొత్తపల్లి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా, ఉమ్మడి కృష్ణా జిల్లాల పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల్లో టీడీపీ ప్రకటించిన అభ్యర్థులకు రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ బేషరతుగా మద్దతు ప్రకటించిందని కొత్తపల్లిలో పండిత పరిషత్ సభ్యుడు కండేపల్లి పెద్దబ్బాయి శనివారం పేర్కొన్నారు. టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులైన పేరాబత్తుల రాజశేఖరం, ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపునకు కృషి చేస్తామన్నారు.

రక్తదాన శిబిరం

పిఠాపురం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి ఆవరణలో చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. రోటరీ బ్లడ్‌బ్యాంక్ సహకారంతో పలువురు రక్తదానం చేశారు. రక్తదాతలను చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు డాక్టర్ మొండి రవికుమార్, అభివృద్ధి కమిటీ డైరెక్టర్లు బొజ్జా కుమార్, వేణుం సురేష్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుజాత అభినందించారు. రవికుమార్ మాట్లాడుతూ ఆసుపత్రికి కావాల్సిన బల్లలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో చేయూత సంస్థ కోఆర్డినేటర్ ఎన్.దయాసాగర్, ఎస్.శ్రీమాన్ నారాయణ, పవన్‌కుమార్ తదితరులున్నారు.

కార్మికులకు దుస్తుల పంపిణీ

పెద్దాపురం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను పురస్కరించుకుని స్థానిక సీహెచ్‌సీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు మన పెద్దాపురం ఫేస్ బుక్ టీమ్ దుస్తులను శనివారం పంపిణీ చేసింది. గ్రూప్ అడ్మిన్ పెదిరెడ్డి నరేష్, నవీన్ నాని, సత్యనారాయణ, హర్ష, భుజంగరావు, రాజేష్ కుమార్, రత్నం, జయశ్రీ, లక్ష్మీ పాల్గొన్నారు.

వృద్ధులకు చీరల పంపిణీ

కాకినాడ రూరల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా కాకినాడ రూరల్ మండలం చీడిగ టీడీపీ మాజీ ఎంపీటీసీ గీసాల శ్రీనివాసరావు, బేబీ దంపతులు శనివారం 40 మంది వృద్ధ మహిళలకు ఉచితంగా చీరలు పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ

కరప, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): నడకుదురు సిద్దార్థనగర్‌లో శనివారం పలువురు పేదలకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. అలయన్స్ ఇంటర్నేషనల్ కమిటీ చైర్మన్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, అలయన్స్ క్లబ్ ఆఫ్ శ్రీ పద్మారామ్ అధ్యక్షుడు పెంకే శివకుమార్, అలయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ వనుం శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

'భోగి'కి దుంగలు సిద్ధం

కొత్తపల్లి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): భోగి పండుగ సోమవారం కావడంతో గ్రామాల్లో చిన్నారులు దుంగలను సిద్ధం చేస్తున్నారు. శనివారం నుంచి సంక్రాంతి సెలవులు కావడంతో కొత్తపల్లికి చెందిన చిన్నారులు భోగి మంటలకు దుంగలు తరలిస్తూ కనిపించారు.



కొత్తపల్లిలో దుంగను తీసుకెళ్తున్న చిన్నారులు

ఘనంగా అయోధ్య బాలరాముడు ప్రాణప్రతిష్ట వార్షిక వేడుకలు

అన్నవరం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): అయోధ్యలో బాలరాముడు ప్రాణప్రతిష్ట జరిగి శనివారం ప్రథమ వార్షికోత్సవం పురస్కరించుకుని గ్రామంలో శ్రీరామ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. తారకరామా కాలనీ రామాలయంనుంచి సుబ్రహ్మణ్యేశ్వర ఆలయం వరకు రామభక్తులు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం 11సార్లు శ్రీరామరక్ష స్తోత్ర పారాయణలు, ఒకసారి హనుమాన్ చాలీషా పఠించారు. రమణమూర్తి, పి.రామకృష్ణ పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

ఘనంగా చిన్నారుల ఆటపాటలతో ముగిసిన శ్రీప్రకాష్ కేరింతలు
ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక



మరమ్మతులు పూర్తికాని రంప రోడ్డుపై రేగుతున్న దుమ్ము

దుమ్ము రేపుతున్న రహదారి

రంపచోడవరం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతికల్లా రహదారులన్నీ గుంతలు లేకుండా తయారవ్వాలన్న కూటమి ప్రభుత్వ సూచనతో చేపట్టిన రంప రహదారి మరమ్మతులు దుమ్ము లేపుతున్నాయి. రంపచోడవరం నుంచి రంప మీదుగా మారేడుమిల్లి మండలాన్ని కలిపే ఈ రహదారి గత ప్రభుత్వ పుణ్యమాని గుంతల మయంగా మారింది. గుంతలను పూడ్చి తారు వేసే పనులు నత్తనడకన సాగుతున్నాయి. గుంతలను మెటల్ రాళ్లతో పూడ్చి వదిలేశారు. దీంతో ఈ రహదారిపై ప్రయాణం వాహనచోదకులకు సంకటంగా మారింది. ఏ వాహనం వెళ్లినా దుమ్మురేచిపోవడం మినహా ప్రయోజం లేకుండా పోయింది. ఈ పరిస్థితికి ఇంజనీర్లు-కాంట్రాక్టరు మధ్య సయోధ్య లేకపోవడం, ఇంజనీర్లకు-కాంట్రాక్టరుకు ఆర్థికపరమైన లబ్ధి చేకూరే



అంశంలో ఒప్పందం లోపించడమే కారణమని రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వరరావు ఆరోపించారు. ఇంజనీరింగ్ అధికారుల వైఖరి కూటమి ప్రభుత్వ లక్ష్యాన్ని నీరుగారుస్తోందన్నారు. తక్షణం ఈ రహదారి పనులను పూర్తి చేయకుంటే బాధ్యులైన ఇంజనీరింగ్ అధికారులపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తామన్నారు.



సాయం అందిస్తున్న జేకే చారిటబుల్ ట్రస్టు సభ్యులు

దహన సంస్కారాలకు ఆర్థిక సాయం

కూనవరం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): కూనవరానికి చెందిన యడ్ల పెంటయ్య భార్య సరస్వతి (43) శనివారం అనారోగ్యంతో మృతిచెందింది. ఈ సమాచారాన్ని గ్రామ పెద్దల ద్వారా జమాల్‌ఖాన్ ట్రస్టు సభ్యులకు తెలియజేశారు. వారి ద్వారా విషయం తెలుసుకున్న ట్రస్టు ఫౌండర్ జమాల్‌ఖాన్ వెంటనే స్పందించి దహన సంస్కారాల నిమిత్తం రూ.3వేలు సభ్యుల ద్వారా అందించారు. కార్యక్రమంలో ముస్లిం గురువు ఎండీ సద్దాం, జేకే ట్రస్టు సభ్యులు ఎస్‌డీ సుఫీ, ఎస్‌కే రసూల్, ముస్లిం కుల పెద్ద షేక్ అహ్మద్ బాషా, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాపికొండలు విహార యాత్రకు టిక్కెట్లు హౌస్ ఫుల్



దేవీపట్నం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి అందాలను ఆస్వాదించే పాపికొండలు పర్యాటకానికి వెళ్లే బోట్లు ఆదివారం హౌస్ ఫుల్ అయ్యాయని నిర్వాహకులు తెలిపారు. సంక్రాంతిని పురస్కరించుకుని పాపికొండలుకు వెళ్లే పర్యాటకులు ఈ నెల 12, 15తేదీల్లో ముందుగానే టిక్కెట్లు బుక్ చేసుకున్నారు. సోమ, మంగళవారాల్లో పది బోట్లకు పైగానే టిక్కెట్లు బుక్ చేసుకోగా మరికొన్ని బోట్లలో సీట్లు వున్నాయని నిర్వాహకులు చెప్పారు.

జీవో నెం.117 రద్దుపై హర్షం

రంపచోడవరం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక పాఠశాలలను నిర్వీర్యం చేస్తూ గత ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం.117ను రద్దు చేయడంపై తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎల్.వెంకటేశ్వర్లు, కార్యదర్శి బోండ్ల వరప్రసాద్, ప్రేమ్‌కుమార్, అజేయ్‌కుమార్, ప్రవీణ్, నరేష్, కోటేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. ప్రతి గ్రామానికీ పాఠశాల, ఉపాధ్యాయుడు ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, మండల స్థాయి క్లస్టర్ కమిటీలను ఏర్పాటు చేయడం ద్వారా 3, 4, 5 తరగతులు హైస్కూల్స్‌లో లేకుండా అడ్డంకులు తొలగిపోయాయన్నారు.

'మూడు రెట్లు పరిహారం అదనంగా ఇవ్వాలి'

దేవీపట్నం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పోలవరం నిర్వాసితులకు కొత్త భూసేకరణ చట్టం ప్రకారం సబ్ రిజిస్టర్ విలువకు మూడు రెట్లు అదనంగా అనగా ఎకరానికి రూ.36 లక్షలు పరిహారం చెల్లించాలని ఆదివాసీ మహాసభ న్యాయ సలహాదారు అయినాపురపు సూర్యనారాయణ, జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ డిమాండ్ చేశారు. శనివారం పోలవరం పనులపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమీక్ష నిర్వహించారు. నిర్వాసితుల సమస్యలను చర్చించాలని, పోలవరం ప్రాజెక్టుకు లక్ష కోట్లు కేటాయించాలని డిమాండు చేశారు.



ఎండిన తాటి చెట్లకు నిప్పు

ఎటపాక, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఎండిన తాటి చెట్లకు ప్రమాదశాత్తు నిప్పు అంటుకోవడంతో మంటలు దావానంలా వ్యాపించాయి. మండలంలోని గన్నవరం-గొందిరాజుపేట గ్రామాల మధ్యలో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా వున్నాయి.... శనివారం సాయంత్రం సమయంలో ఎండిన తాటిచెట్లకు నిప్పు అంటుకుని, మంటలు పెద్దగా అంటుకున్నాయి. గుర్తించిన స్థానికులు వెంటనే మంటలను ఆర్పే ప్రయత్నం చేసి... ప్రమాదంపై విద్యుత్ శాఖ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. విద్యుత్ శాఖ సిబ్బంది సరఫరాను నిలుపుదల చేయడంతో ప్రమాదం తప్పింది. మంటలంటుకున్న పక్కనే 63 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు విద్యుత్ లైన్ ఉండడంతో స్థానికులు భయందోళన చెందారు. ఉప సర్పంచ్ కందుకూరి స్వర్ణ, టీడీపీ నాయకులు బొల్లా పుల్లయ్య ప్రమాదం తీరును పరిశీలించి, మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. అనంతరం విద్యుత్ మోటార్‌తో మంటలను అదుపు చేశారు. కాగా కొందరు ఆకతాయిలు ఆ వైపుగా వెళ్తూ ఎండిన తాటిచెట్లపై ధూమపానం చేసి పడేసినట్లుగా తెలుస్తోంది. లైన్‌మెన్ జె.దేవేందర్ నాయక్ అరగంట తర్వాత విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

ఘనంగా సంక్రాంతి వేడుకలు



తుని శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల్లో హరిదాసుకు బియ్యం పోస్తున్న విద్యార్థినులు

తుని రూరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): శ్రీ ప్రకాష్ విద్యాసంస్థలల్లో బాలఉద్యానవనం నుంచి 5వ తరగతి వరకు విద్యార్థులకు నిర్వహించిన కేరింతలు కార్యక్రమం ఘనంగా ముగిసింది. దీనికి ముఖ్యఅతిథిగా ప్రాంత కార్యకారిణి, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం,ఆంధ్రప్రదేశ్ కార్యదర్శి ఆంధ్రప్రదేశ్అధ్యయన కేంద్రం (సీఏపీఎస్)ప్రాజెక్టు సమన్వయ కర్త శ్రీవివేకానంద, మహారోగి ఆరోగ్య కేంద్రం వోలేటి సత్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా హాజరైన విద్యార్థులు, తల్లిదండ్రులతో ఆయన మాట్లాడుతూ నేటి విద్యార్థులు ఆశలు, ఆకాంక్షలు కలిగి ఉండాలని, ఆనందంగా జీవితం గడపాలన్నారు. స్వామి వివేకానంద చెప్పినట్లు విద్యార్థులు సింహం వంటి గుండె ధైర్యం, సాహసం కలిగి ఉండాలని, అటువంటి వారిని మాత్రమే విజయం వరిస్తుందని ఆయన తెలిపారు. శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్ మాట్లాడుతూ విద్యార్థులు కేవలం చదువుకి మాత్రమే పరిమితమైతే వారికి ఒత్తిడి పెరిగి మానసిక సంఘర్షణకు లోనవుతారని, ఆటపాటలతో కూడిన విద్యాబోధన వారికి మరింత ఉత్సాహం, ఉత్తేజాన్ని కలగజేస్తాయని, అందుకే విద్యార్థులకు విలువలు, విజ్ఞానం, విజయం ఈ మూడు అందించాలనే ఆశయంతో ఉత్తమ బోధన సాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సంక్రాంతి సంబరాలతో ప్రారంభమైన విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలుతో ముగిసింది. సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. విద్యాసంస్థల అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు, సంయుక్త కార్యదర్శి అజయ్‌ప్రకాష్, సీనియర్ ప్రిన్సిపల్ ఎంవీవీఎస్ మూర్తి, కన్వీనర్ టి.సంధ్యారాణి, శ్రీప్రకాష్ వివిధ శాఖల విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏలేశ్వరంలో..

ఏలేశ్వరం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. శనివారం ఏలేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, యర్రవరం విజ్ఞానజ్యోతి జూనియర్ కళాశాల నేతృత్వంలో సంబరాల్లో భాగంగా ప్రిన్సిపాల్ సునీత, ప్రయాగమూర్తి, కరస్పాండెంట్ చిత్రా నాగేశ్వరరావు, డైరెక్టర్ వీరవెంకటరమణ విద్యార్థులతో రంగవల్లులు, మ్యూజికల్ చైర్స్, హరిదాసు, గంగిరెద్దు వేషధారణలతో వైభవంగా సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు.

క్రీడలపట్ల ఆసక్తి పెంపొందించండి

కోటనందూరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): యువత జూదంవైపు మరలకుండా ఉండాలనే ఉద్దేశ్యంతోనే సంప్రదాయ క్రీడలను ప్రోత్సాహించే లక్ష్యంతో సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నామని పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు అన్నారు. కోటనందూరు మదర్ విద్యాసంస్థలో వాలీబాల్ పోటీఆటగాళ్లతో కరచాలనం శనివారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత పెడదోవ పెట్టకుండా ఉండాలంటే ఆటపాటల వైపు మొగ్గు చూపాలన్నారు. కార్యక్రమంలో తుని రూరల్ సీఐ జి.చెన్నకేశవరావు, ఎస్ఐటీ రామకృష్ణ, మాజీ ఎంపీపీ డి.చిరంజీవిరాజు, టీడీపీ నేత వెలగా వెంకట కృష్ణారావు, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు పి.శ్రీనివాస్‌రావు, జనసేన నేతలు పెనుముచ్చుప్రవీణ్, అంకంరెడ్డి రాజశేషు, చిటికెలవిజయ్, మదర్ విద్యాసంస్థల చైర్మన్ పెనుముచ్చునాగేశ్వరరావు పాల్గొన్నారు.

చిల్లంగి అంగన్‌వాడీలో సంబరాలు

కిర్లంపూడి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిల్లంగిలో అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. చిల్లంగి సెక్టార్ సూపర్‌వైజర్ బూసమ్మ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్ అనంతలక్ష్మి అధ్యక్షతన జరిగాయి. చిన్నారులు సంప్రదాయ వస్త్రధారణతో అలరించారు. భోగిమంటలు, రంగువళ్లులు, హరిదాసుల ఆటపాటలతో సందడి చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సుఖసంతోషాలతో సంక్రాంతి జరుపుకోవాలి

గండేపల్లి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ మండల ప్రజలంతా సుఖ సంతోషాలతో జరుపుకోవాలని ఎంపీడీవో నాతి బుజ్జి అన్నారు. శనివారం గండేపల్లి మండల పరిషత్ కార్యాలయంలో రంగవల్లులు వేసి ముందస్తు సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు.



కోటనందూరు మండలం మదర్ విద్యాసంస్థలో వాలీబాల్ ఆటగాళ్లతో డీఎస్పీ కరచాలనం

ప్రగతిలో..

మండలంలోని సూరంపాలెం ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ప్రగతి కల్చరల్, స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో వివిధ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రగతి ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ డాక్టర్ పరుచూరి కృష్ణారావు మాట్లాడుతూ విద్యార్థి దశలో విద్యార్థులందరూ క్రమశిక్షణ, ప్రతిభ, అకుంఠిత దీక్షతో బాటు సేవా తత్పరత కలిగి ఉండాలని తెలియజేశారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా మన సాంప్రదాయాలను గుర్తుచేస్తూ విద్యార్థినీ, విద్యార్థులందరికి రంగోలీ, గాలిపటాలను ఎగురవేసే పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణతో భారతీయ సంస్కృతికి ప్రతీకగా నిలిచారు. కళాశాల విద్యార్థులు సంక్రాంతి విలువలను తెలిపేలా భోగి మంటలు, హరిదాసు నృత్యాల కార్యక్రమాలు నిర్వహించారు. కళాశాలలో విద్యార్థులకు త్రో బాల్, వాలీ బాల్, క్రికెట్, జావెలిన్ త్రో, షాట్‌పుట్, 100మీ, 400మీ, 800 మీటర్ల రన్నింగ్ వంటి గేమ్స్ నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ మేనేజ్‌మెంట్ ఎంవి హరనాధబాబు, వైస్ ప్రెసిడెంట్ ఎం.సతీష్, డైరెక్టర్ అకడమిక్స్ డాక్టర్ కె.సత్యనారాయణ, డీన్ ఆర్‌డి డాక్టర్ పి.మాచిరాజు, డీన్ కెరీర్ డెవలప్‌మెంట్ సెల్ డాక్టర్ ఎం.రాధికామణి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ వై.జయబాబు పాల్గొన్నారు.

పెద్దిపాలెంలో ముగ్గుల పోటీలు

ప్రత్తిపాడు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సంబరాల్లో భాగంగా ప్రత్తిపాడు మండలం పెద్దిపాలెంలో భాగంగా శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు ఆధ్వర్యంలో ఈ ముగ్గుల పోటీల్లో ప్రథమ బహుమతి చెన్నంశెట్టి సుధ ప్రథమ బహుమతి, సారిపల్లి మణి కి ద్వితీయ, బర్ల స్వామికి తృతీయ బహుమతి గెలుపొందగా వీరికి మండల వెలుగు ఏపీఎం వై.వెంకట్రావు బహుమతులు అందజేశారు. మూరా చిన్నిబాబు, రామరాజు, నిఖేష్ వర్మ, రామకృష్ణ, ఏపీఏలు నూకరత్నం, భవాని తదితరులు పాల్గొన్నారు.

బహుమతులు పంపిణీ

తొండంగి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల విజేతలకు టిడిపి సీనియర్ నేత యనమల రాజేష్, తుని రూరల్ సిఐ చెన్నకేశవరావు బహుమతులు అందించారు. శనివారం తాటియాకులపాలెం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో పోటీలో పాల్గొని విజేతలగా నిలచిన వారికి నగదు బహుమతితోపాటు షీల్డులు బహూకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ యువత జూద క్రీడలకు దూరంగా ఉండి ,సాంప్రదాయ క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పండగ రోజులు కుటుంబ సభ్యులతో పాటు ఆనందంగా గడపాలన్నారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా మత్స్యకార అధ్యక్షులు కోడ వెంకట రమణ, పేకేటి దారకొండ, చొక్కా కాశీశ్వరావు, చొక్కా అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

13న సత్యదేవుడి సన్నిధిలో సంబరాలు

అన్నవరం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిధిలో ఈనెల 13న సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగుదనం ఉట్టిపడేవిదంగా గంగిరెద్దులు, జంగమదేవరలు, ఎడ్లబండి, దాన్యపురాశి, బొమ్మలకొలువు, బోగిమంటలు, సంక్రాంతి పిండివంటల తయారీ తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నామని భక్తులు ఈకార్యక్రమంలో పాల్గొని నేటితరం యువతకు పూర్వపు సంక్రాంతి పండుగలు ఎలా జరుపుకునేవారో పెద్దలు తెలియపరచాలని అన్నారు.

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు

రత్నగిరిపై సంక్రాంతి పురస్కరించుకుని శనివారం ఆలయ ప్రాంగణంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు అధికసంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను కనబరిచారు. సత్యదేవుడు, అమ్మవారు, శంకరుల మూలవరుల ప్రతిరూపంతో ముగ్గు ఆకట్టుకుంది.



కిర్లంపూడి మండలం చిల్లంగి అంగన్‌వాడీలో సంక్రాంతి సంబరాలు

ప్రత్తిపాడులో ఉపాధి హామీ పథకం సోషల్ ఆడిట్ సమావేశం

ప్రత్తిపాడు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో గతేడాది నిర్వహించిన ఉపాధి హామీ పథకం పనుల్లో జరిగిన అవకతవకలకు సంబంధించి రూ.2,84,273 రికవరీలు, మరో రూ.15వేల అపరాధరుసుం వసూలుకు డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి ఆదేశాలు జారీ చేశారు. మండల పరిషత్ కార్యాలయంవద్ద శనివారం ప్రత్తిపాడు మండలంలో 2023-24 సంవత్సరంలో నిర్వహించిన రూ.11.74కోట్ల ఉపాధి పనులకు సంబంధించి శనివారం సామాజిక తనిఖీ ప్రజావేదిక సోషల్ ఆడిట్ సభను నిర్వహించారు.ఈ సందర్భంగా మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లో 1006ఉపాధి పనులకు సంబంధించి 15రోజులుగా గ్రామసభలు నిర్వహించి సామాజిక తనిఖీ సిబ్బంది పరిశీలనలు చేశారు. మండలస్థాయి సామాజిక తనిఖీ సభలో గ్రామాల్లో బురదకోట, గజ్జనపూడిలో చనిపోయిన వ్యక్తుల పేర్లతో మస్తర్లు వేశారని, పొదురుపాకలో పనికిరాని వారికి కూడా మస్తర్లు వేశారని, ధర్మవరంలో రూ.1.17లక్షలు ఉపాధి నిధులు అనుమతి లేకుండా డ్రా చేశారని, సామాజిక తనిఖీ సభ దృష్టికి ఆయా గ్రామస్తులు తెలిపారు. లంపకలోవలో గ్రామ పంచాయతీ అనుమతులు, తీర్మానాలు లేకుండానే పనులు నిర్వహించారని గ్రామస్తులు తెలిపారు. దీనిపై 23గ్రామ పంచాయతీల పరిధిలో జరిగిన

రూ.2.84లక్షల నిధులు రికవరీకి డ్వామా పీడీ ఆదేశాలు

రూ.15వేల అపరాధ రుసుం విధింపు

ఉపాధి హామీ పథక అవకతవకలను గుర్తించి రూ.2.84లక్షల రికవరీలు, రూ.15వేలు అపరాధ రుసుము వసూలుకు డ్వామా పీడీ ఆదేశించారు. ఈ తనిఖీ సభలో ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్‌బాబు, ఏపీడీ భాను ప్రకాష్, జేఈ సత్యప్రకాష్, ఈవోపీఆర్డీ కాశీ విశ్వనాధ్, ఏపీవోలు కుమార్‌స్వామి, నాయుడు, సోషల్ ఆడిట్ విజిలెన్స్ అధికారి రాజేష్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

జగ్గంపేట, జనవరి 11(ఆంధ్రజ్యోతి): గేమ్ చేంజర్ ప్రీరిలీజ్ ఈవెంట్‌కి హాజరై తిరిగి ఇంటికి వెళ్తూ రోడ్డుప్రమాదంలో మరణించిన అరవపల్లి మణికంఠ, తోకాడ చరన్‌ల దశ దినకర్మకు జగ్గంపేట జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ పాల్గొని కుటుంబాలను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

విజయవంతంగా 'ఆదిత్య' కలర్స్-25 యువజనోత్సవాలు

గండేపల్లి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్శిటీలో నిర్వహిస్తున్న యువజనోత్సవాలు మూడవ రోజు కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సాగిలి, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఛాన్సలర్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి, విశిష్ట అతిథిగా సినీనటుడు కిరణ్ అబ్బవరం పాల్గొన్నారు. చివరిరోజు కార్యక్రమాలు మరింత జోష్‌గా జరిగాయి. విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో అలరించాయి. ఆదిత్య పూర్వ విద్యార్థులు సైతం తమ పిల్లాపాపలతో పాల్గొని ఆదిత్య కలర్స్‌కు సరికొత్త రంగులు తీసుకొచ్చారు. లేజర్ షో అద్భుతంగా ఆకట్టుకుంది. వివిధ విభాగాల ఆటల పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా ఆదిత్య ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎన్.సతీష్‌రెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమం విజయవంతం కావడంలో సహకరించిన ప్రిన్సిపాల్‌కు, డీన్‌లకు, విభాగాధిపతులు, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. చివరి రోజు కార్యక్రమంలో అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.



ఆదిత్య కలర్స్‌లో విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న దృశ్యం

సత్యదేవుడికి వేడుకగా ప్రాకారసేవ

అన్నవరం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): సత్యదేవుడికి శనివారం ప్రాకారసేవ వేడుకగా జరిగింది. ఉదయం 10గంటలకు స్వామి,అమ్మవార్లను తిరుచ్చివాహనంపై ఆశీనులు గావించి పండితుల పూజలనంతరం ముమ్మారు తూర్పురాజగోపురం చుట్టూప్రదక్షణ గావించారు. అనంతరం హారతులిచ్చి ప్రదానాలయానికి తీసుకెళ్లారు. ఈవో వీర్ల సుబ్బారావు కుటుంబ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

పంచాయతీ శానిటేషన్ సిబ్బందికి నూతన వస్త్రాల పంపిణీ

అన్నవరం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పనిచేస్తున్న శానిటరీ, వాటర్‌వర్క్స్, ఎలక్ట్రికల్ సిబ్బందికి పంచాయతీ ఆధ్వర్యంలో నూతన వస్త్రాలు ఉచితంగా అందజేశారు. సర్పంచ్ కుమార్‌రాజా మాట్లాడుతూ నిత్యం శ్రమించే పంచాయతీ శ్రామికులు సంక్రాంతి పండుగను సుఖసంతోషాలతో గడుపుకోవాలన్నారు. పంచాయతీ ఈవో వాడ్రేవు, చక్రవర్తి పాల్గొన్నారు.

అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు

తుని రూరల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ప్రజా జీవితాలకు సమాజశాంతికి భంగం కలిగించే ఏ కార్యక్రమాలకు పాల్పడిన చర్యలు తప్పవని తుని రూరల్ ఎస్ఐ కృష్ణమాచార్యులు స్పష్టం చేశారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కోడిపందాలు,పేకాట, గుండాల, రికార్డింగ్ డ్యాన్స్ వంటి కార్యక్రమాలకు పాల్పడితే చట్టప్రకారం తీవ్రమైన చర్యలు తీసుకుంటామన్నారు.

వ్యక్తికి తీవ్రగాయాలు

తొండంగి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై ఏవీ నగరం సెంటర్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలుకాగా మరో మహిళకు గాయాలయ్యాయి. ఏవీ నగరం గ్రామానికి చెందిన ఏడిద జాన్ అనే వ్యక్తి మోటార్ సైకిల్‌పై రోడ్డు దాటుతుండగా విశాఖపట్నం నుంచి రాజమండ్రి వైపుగా వెళ్తున్న కారు ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయని పోలీసులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

అంబేడ్కర్ కాంస్య విగ్రహం ఆవిష్కరణ

తొండంగి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ఎ.కొత్తపల్లిలో రూ.15లక్షలతో నిర్మించిన అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని శనివారం విశ్రాంత ఐఏఎస్ పీవీ రమేష్, పీవీ రావు సోదరుడు పీఎస్ఎన్ మూర్తి ఆవిష్కరించారు. నవ భారత రాజ్యాంగ నిర్మాతగా అంబేడ్కర్ దేశానికి, అట్టడుగు వర్గాల అభ్యున్నతికి చేసిన కృషిని వక్తలు కొనియాడారు. ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ విశ్రాంత వైస్ ఛాన్సలర్ డాక్టర్ బాబ్జి, ఎన్.సోనీఉడ్, ఎం.శ్రీనివాస్, జి.బాబ్జి, వై.మాణిక్యం, సీహెచ్ సత్యనారాయణ, ఎస్.చంద్రశేఖర్, అంబేడ్కర్ యువజన సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ

జగ్గంపేట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సామాజిక తనిఖీని శనివారం నిర్వహించారు. మండలంలో ఈ ఆర్థిక సంవత్సరంలో 763 పనులకు వేతనంగా రూ.8.05కోట్లు, మెటీరియల్ రూపంలో రూ.2.73కోట్లు ఖర్చుచేశారు. అధికారులు ఇంటింటికి వెళ్లి సర్వే చేశారు. మండలంలోని 16పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. ఇందులో పథకం సిబ్బందికి రూ.32వేలు, జరిమానా రూపంలో రూ.5.83 లక్షలు విధించారు. కాట్రావులపల్లి పంచాయతీ నుంచి రూ.1.66లక్షలు, నరేంద్రపట్నం పంచాయతీలో విధులనుంచి తొలగించిన ఫీల్డ్ అసిస్టెంట్ వద్ద రూ.60,875 రికవరీ చేశారు. ఇక్కడున్న ఫీల్డ్ అసిస్టెంట్ జి.సత్యరాజును సస్పెండ్ చేశారు. కార్యక్రమంలో ప్రిసైడింగ్ అధికారి, డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి, భానుప్రకాశ్ పాల్గొన్నారు.